

యువతకు రాయల్స్ పెద్దపీట

- 14ఏళ్ల సూర్యవంశీపైనే అందరి చూపు

8

PRAJASAKTI Regd.No.APTEL /2005 /15054

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Rajahmundry, Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 21 సంచిక : 162 | రాజమహేంద్రవరం, గురువారం 26 మార్చి 2026 | 8 పేజీలు వెల : 5.50

Vol No | Rajahmundry, Thursday 26 March 2026 | Rs

## ప్రైవేట్ పాఠశాలల్లో 30,075 మందికి ఉచిత సీట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం 2026-27 విద్యాసంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలల్లో 30,075 మంది పేద విద్యార్థులకు సీట్లు కేటాయింపు జరిగిందని సమగ్రశిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు వెల్లడించారు. ఆర్‌టిఇ చట్టం కింద కేటాయింపు 25శాతం ఉచిత ప్రవేశాలకు సంబంధించిన మొదటి విడత లాటరీ ఫలితాల తుది జాబితాను బుధవారం ఆయన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 54,647 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 50,016 మందిని అర్హులుగా పరిగణించామని తెలిపారు. మొదటి విడత లాటరీలో ఒక కిలోమీటర్ పరిధిలో ఉన్న 30,075 మంది విద్యార్థులను ఎంపిక చేశామని వివరించారు. ఎంపికైన విద్యార్థుల సమాచారం తల్లిదండ్రుల మొబైల్ నెంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయడంతో పాటు cse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఇరాన్‌కు

# ట్రంప్ 15 డిమాండ్లు!

- ఫలవంతమైన చర్చలు జరిపామన్న ట్రంప్
- తోసిపుచ్చిన ఇరాన్
- వారితో వారు చర్చలు జరుపుతున్నారంటూ ఎద్దేవా
- కొనసాగిన దాడులు

టెహరాన్, వాషింగ్టన్ : గత నాలుగు వారాలుగా యుద్ధోన్మాదంతో వ్యవహరిస్తూ పశ్చిమాసియాలో దాడులు, ఘర్షణలను రగిల్చిన అమెరికా తాజాగా ఇరాన్‌తో కాల్పుల విరమణకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అయితే ఆ కాల్పుల విరమణకు అమెరికా తనదైన 15పాయింట్ల ప్రణాళిక పేరుతో తన డిమాండ్ల జాబితాను పాక్ మధ్యవర్తుల చేతికిచ్చి ఇరాన్‌కు పంపింది. ఆ ప్రణాళిక ఇరాన్ చేతికి అందిందని బుధవారం పాకిస్తాన్ అధికారులు తెలిపారు. పేరుకు 15 పాయింట్లు అని వున్నా అందులో వున్నవన్నీ అమెరికా డిమాండ్లే. ఇరాన్ తప్పనిసరిగా అమలు చేయాల్సిన అంశాలే.

ఒకవైపు కాల్పుల విరమణకు ప్రతిపాదనలు పంపుతూనే మరోవైపు పశ్చిమాసియాకు అదనపు బలగాలను అమెరికా తరలిస్తోంది. ఇప్పటికే అక్కడ వున్న నావికా బలగాలకు మద్దతుగా మరిన్ని బలగాలను పంపుతోంది. ఇరాన్‌లో సైనిక కార్యకలాపాలకు మద్దతుగా మరో 3వేలమంది సైనికులు అక్కడకు వెళతున్నారని వార్తలు వెలువడ్డాయి. ఈ వారంలో యుద్ధాన్ని ముగించడానికి ఉద్దేశించి టెహరాన్‌తో ఫలవంతమైన చర్చలు జరిగాయని ట్రంప్ చెబుతున్నారు. అయితే ఇరాన్ మాత్రం ఆ వాదనలను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చుతోంది.

**ఆ 15డిమాండ్లు ఏమిటి ?**

30రోజుల పాటు కాల్పుల విరమణ, నటాంజ్, ఇస్ఫాన్, ఫోర్డోల్లో అణు కేంద్రాలను ధ్వంసం చేయడం, ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోమని ఇరాన్ శాశ్వతంగా హామీ నివ్వడం వంటి డిమాండ్లు ఆ 15 పాయింట్ల ప్రణాళికలో వున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ వద్ద వున్న శుద్ధి చేసిన యురేనియం నిల్వలన్నింటినీ అప్పచెప్పాలి, ఇరాన్ క్షిపణుల రేంజ్, వాటి సంఖ్యపై పరిమితులు విధించాలి, ప్రాంతీయ దేశాల ఇంధన సదుపాయాలపై దాడులు వెంటనే ఆపాలి, హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలి. ఇవన్నీ ఇరాన్ చేస్తే ఇరాన్‌పై విధించిన అన్ని ఆంక్షలను తొలగిస్తామని ట్రంప్ చెబుతున్నారు.



దక్షిణ లెబనాన్‌లో టైర్ పట్టణంపై ఇజ్రాయిల్ దాడులతో ఎగిసిపడుతున్న పొగలు

**వారితో వారు చర్చలు జరుపుకుంటున్నారా ? ఎద్దేవా చేసిన ఇరాన్**

ఇదిలా వుండగా తమతో చర్చలు జరుగుతున్నాయనంటూ అమెరికా చెబుతున్న వాదనలను ఇరాన్ మిలటరీ తోసిపుచ్చింది. అమెరికన్లు వారితో వారు చర్చలు జరుపుకుంటున్నట్లు వున్నారని ఇరాన్ సైనిక ప్రతినిధి ఒకరు ఎద్దేవా చేశారు. "మీరు ఒకప్పుడు వ్యూహాత్మక శక్తి అంటూ చెప్పుకొచ్చింది ఇప్పుడు వ్యూహాత్మక వైఫల్యంగా మారింది. ప్రపంచ అగ్రరాజ్యం సాధ్యమైతే ఈ సంక్షోభం నుండి బయటపడగలిగి వుండేది. కానీ మీ ఓటమిని ఒప్పందంగా మార్చడానికి ప్రయత్నించకండి. శుష్క వాగ్దానాల శకం ఇక ముగిసింది. మీతో మీరే మాట్లాడుకునే దశకు మీ అంతర్గత ఘర్షణలు చేరాయా?"అంటూ లెఫ్టినెంట్ కల్నల్ ఇబ్రహీం జోల్ఫాఘరి ఒక ప్రకటన విడుదల చేశారు. పాకిస్తాన్ ద్వారా ఇరాన్‌కు 15పాయింట్ల ప్రణాళిక పంపిన వెంటనే ఈ ప్రకటన వెలువడింది. "మొదటి రోజు నుండి మా మాటలు ఒకలానే వున్నాయి. అవి మారలేదు. అయినా మాలాంటి వారు మీలాంటి వారితో సద్దుకు పోవడమనేది జరగదు. ఇప్పుడే కాదు, ఎప్పటికీ జరగదు." అని స్పష్టం చేశారు. మంగళ వారం వరకు ఈ యుద్ధం కారణంగా ఇరాన్‌లో 1500మంది మరణించారు. 18వేల మందికి పైగా గాయపడ్డారని ఇరాన్ ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. అమెరికా, ఇజ్రాయిల్‌పై పోరాటం సాగుతుందని ఇరాన్ మిలటరీ ప్రకటించింది. బుధవారం ఇజ్రాయిల్, పర్షియన్ గల్ఫ్ ప్రాంతాలపై దాడులకు పాల్పడింది. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ తెలిపింది.

**కొనసాగిన దాడులు**

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్

మిగతా 7లో

## రాజ్యాంగ ధర్మాసనానికి దళిత క్రిస్టియన్లపై సుప్రీం తీర్పు

- సిపిఎం డిమాండ్

న్యూఢిల్లీ : ఒక వ్యక్తి క్రైస్తవంలోకి మారి, చురుకుగా ఆ మతాన్ని, దాని ఆచార, సంప్రదాయాలను పాటిస్తున్నట్లైతే ఇక ఆ వ్యక్తిని ఎస్‌సి సభ్యుడిగా పరిగణించలేమంటూ ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు సమర్ధించడంతో సిపిఎం తీవ్రంగా విభేదించింది. ఈమేరకు పొలిట్‌బ్యూరో బుదవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎస్‌సి కమ్యూనిటీకి కల్పించిన రిజర్వేషన్లు, ఇతర రక్షణలు ఆయా కమ్యూనిటీల సామాజిక, ఆర్థిక స్థితిగతుల ప్రాతిపదికగా కల్పించబడ్డాయని సిపిఎం దృఢంగా విశ్వసిస్తోందని పొలిట్‌బ్యూరో ప్రకటన పేర్కొంది. అయితే, ప్రస్తుత తీర్పు మాత్రం సంబంధిత గ్రూపు సామాజిక, ఆర్థిక అంశాలను పరిగణనలోకి తీసుకునే కన్నా మతపరమైన గుర్తింపునకే స్పష్టంగా ప్రాధాన్యతనిచ్చింది. అందువల్ల, ప్రస్తుత ఉత్తర్వులు రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్, ఇతర రక్షణలు కల్పించాలనే మూల లక్ష్యాన్నే దెబ్బతీస్తున్నాయి. అందువల్ల ఈ ఉత్తర్వులను తప్పనిసరిగా రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలని, వారు పరిశీలించి, ప్రస్తుత ఉత్తర్వులను సవరించాలని పొలిట్‌బ్యూరో అభిప్రాయపడుతోంది.

## తీవ్ర సంక్షోభం అంచున భారత్

- పొంచి ఉన్న 2008 నాటి గండం
- బెర్న్‌స్టెయిన్ హెచ్చరిక
- కుప్పకూలనున్న మార్కెట్లు : యుబిఎస్

3

# 'వ్యవసాయ' పాలన.. గందరగోళం

- సెలవులో డైరెక్టర్
- మనస్తాపంతో అధికారుల సహాయ నిరాకరణ
- తమను వేధిస్తున్నారంటున్న సిబ్బంది
- ప్రతి విషయంలోనూ మంత్రి పేషీ జోక్యం
- తాజాగా జెడిఎ పోస్టింగ్‌లపై ఆరోపణలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

వ్యవసాయశాఖ పాలన గాడి తప్పింది. ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుంది. ప్రతి చిన్న విషయంలోనూ మంత్రి పేషీ జోక్యం, డిపార్ట్‌మెంట్‌లో ఆధిపత్యపోరు, కొన్ని ప్రధాన పోస్టులలో ఏళ్ల పర్యంతం అధికారుల తిష్ట, అడుగడున పేరుకుపోయిన అవినీతి వెరశి పాలనలో గందరగోళం నెలకొంది. ఈ పరిస్థితులు గమనించిన ఐఎఎస్‌లు వ్యవసాయశాఖ అంటే భయపడి ఆమడ దూరం జరుగుతున్నారు. ఒకవేళ ధైర్యం చేసి చక్కదిద్దేందుకు ప్రయత్నించిన అధికారులు అంతర్గతంగా అవరోధాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ సంవత్సరం రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం చూపుతుందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. పంట కాలాన్ని ముందుకు జరిపి మే 15 నుంచి ఖరీఫ్‌నకు సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చిన తరుణంలో వ్యవసాయశాఖలో లుకలుకలు ఇబ్బందికరంగా తయారయ్యాయి.

**యూరియాతో ఆరంభం**

2025 ఖరీఫ్‌లో రాష్ట్రంలో తలెత్తిన యూరియా సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలపై వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావును ప్రభుత్వం అక్టోబర్‌లో బదిలీ చేసి ఆ స్థానంలో డాక్టర్ మనజిర్ జిలాని సమూన్‌ను నియమించింది. బాధ్యతలు చేపట్టిన వెంటనే వ్యవసాయశాఖ పాలన ప్రక్షాళనకు ఆయన ప్రయతించగా పలువురు కీలక అధికారులు సహకరించలేదని సమాచారం. రాష్ట్రానికొచ్చిన యూరియాను డిమాండ్ కనుగుణంగా జిల్లాలకు పంపిణీ చేయడంలో డైరెక్టరేట్‌లోని ఒక కీలక అధికారి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని గుర్తించి అతన్ని పక్కనపెట్టి, ఆ బాధ్యతలను మరొక అధికారికి జిలాని అప్పగించారు. కొన్ని అక్రమాలు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో ఒకటి రెండు జిల్లాల్లోని అధికారులను సస్పెన్షన్ చేశారు. ఇది నచ్చని ఆరోపణలెదుర్కొంటున్న కీలక అధికారి కొన్ని రోజులు శెలవుపై వెళ్లి తిరిగొచ్చారు. కొన్నేళ్లుగా ఒకే పోస్టులో ఉన్న ఆ అధికారికి మద్దతుగా ఆయనతో అంటకాగిన కొంత మంది ఎరువుల కంపెనీల ప్రతినిధులు, హోల్‌సేలర్లు, రిటైలర్లు డైరెక్టర్ జిలానీపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక సమావేశం నిర్వహింపజేసి వ్యవహారం సర్దుమణిగేలా చక్రం తిప్పారని తెలిసింది. సరిగ్గా ఇదే సమయంలో కింది స్థాయి అధికారులు, సిబ్బందిపై చిన్న కారణాలు చూపి ఉద్దేశపూర్వకంగా వేధింపులకు జిలాని గురి చేస్తున్నారని వ్యవసాయశాఖలోని కొందరు అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించి డైరెక్టర్‌ను నిలదీయడానికి ప్రయత్నించి తరువాత వెనక్కి తగ్గారని తెలిసింది. దీనికి వ్యవసాయ మంత్రి పేషీ నుంచి మద్దతు ఉన్నట్లు ఉద్యోగులే చెబుతున్నారు. వరుస పరిమాణామాలతో మనస్తాపం చెందిన డైరెక్టర్ జిలానీ ఈ నెల 3 నుంచి 22 వరకు సెలవులో వెళ్లారు. 23న బాధ్యతల్లో చేరతారనుకోగా ఏప్రిల్ 5 వరకు శెలవు పొడిగించగా ప్రభుత్వం అనుమతించింది. వ్యక్తిగత కారణాలతోనే శెలవులో వెళ్లారంటున్నా, అసలు కారణం

మిగతా 7లో

## వచ్చే 3 నెలలు అధిక ఉష్ణోగ్రతలు

- తీవ్రంగా వడగాడ్పులు
- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి జయలక్ష్మి



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వచ్చే 3 నెలలపాటు నెలకొనే అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి జయలక్ష్మి సూచించారు. వడగాడ్పుల నుంచి ఉపశమనం పొందేందుకు అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజురోజుకూ పెరుగుతోన్న ఉష్ణోగ్రతలు, రానున్న రోజుల్లో సంభవించే వడగాడ్పుల సన్నద్ధతపై ఆర్‌టిజిఎస్ నుంచి వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 40 నుంచి 42 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఎండ తీవ్రత, వడగాడ్పుల నుంచి కాపాడుకునేందుకు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేలా ప్రజల్లో తగిన అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సహా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఉపాధి కూలీలు ఉదయం 11 గంటల్లోపు పని ముగించాలని, పనిచేసే చోట్ల తాగునీరు, మజ్జిగ, టెంట్లు, ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. అలాగే ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నందున ఆయా పరీక్షా కేంద్రాల వద్ద తగిన తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా, పురపాలక శాఖ, జలవనరులశాఖ సమన్వయంతో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఎండల వల్ల పశువులకు ముప్పు కలగకుండా గ్రామాల్లోని నీటి తొట్టెలను ట్యాంకర్లతో నిరంతరం నింపాలని, పశుగ్రాసం విషయంలో రైతులకు తగిన సూచనలివ్వాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. వైద్యారోగ్య, విద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, కార్మిక, వ్యవసాయ, విద్యుత్, స్వర్ణ గ్రామ-వార్డు సచివాలయాల, నీటిపారుదల, మత్స్యశాఖలు యాక్షన్‌ప్లాన్ ప్రకారం అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని ప్రజలను పూర్తి అప్రమత్తం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టరు ప్రఖర్ జైన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈ నెల 12న అత్యధికంగా 42.6, 13న 42.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోద య్యాయని తెలిపారు.




## 28న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర అసెంబ్లీ ఈ నెల 28న (శనివారం) ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సమావేశంలో సిఆర్‌డిఎ-2014కు సవరణ చేసి, అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటిస్తూ తీర్మానం చేయనున్నారు. అనంతరం ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు కేంద్రం సానుకూలంగా ఉందని, చట్టపరమైన ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం చేసిన సూచన మేరకు ఈ తీర్మానాన్ని చేసి పంపుతున్నట్లు చెబుతున్నారు.

## 'మిట్టల్'తో స్నేహం... విశాఖ 'ఉక్కు'కు ద్రోహం

3

# అఖిలపక్షానికి మోడీ గైర్హాజరు

- నిలదీసిన ప్రతిపక్ష నేతలు
- దేశంలో ఇంధన సంక్షోభం లేదన్న ప్రభుత్వం



కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన పార్లమెంట్ భవనంలో బుధవారం జరిగిన అఖిల పక్ష సమావేశం దృశ్యం.

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పశ్చిమాసియా సంఘర్షణ, ఇంధన సంక్షోభం వంటి కీలకమైన అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం బుధవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గైరుహాజరయ్యారు. కీలకమైన సమావేశానికి ప్రధాని మోడీ రాకపోవడంపై కేంద్ర మంత్రులను ప్రతిపక్ష నేతలు నిలదీశారు. కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన పార్లమెంట్ భవనంలో ఈ సమావేశం సాయంత్రం 5 గంటలకు ప్రారంభమై 1:45 గంటల పాటు జరిగింది. కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, ఎస్. జైశంకర్, కిరణ్ రిజిజు, హర్దీప్ సింగ్ పూరి, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ మాట్లాడారు. పశ్చిమ ఆసియా సంఘర్షణ నేపథ్యంలో కూడా దేశంలో ఇంధన సంక్షోభాన్ని నివారించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని ప్రభుత్వం తెలిపింది. అలాగే దేశంలో ఇంధన సంక్షోభం లేదని కేంద్రం తన వాదనను పునరుద్ఘాటించింది. "తగినంత నిల్వలు ఉన్నాయి. రాబోయే రోజుల్లో నాలుగు లేదా ఐదు నౌకలు భారతదేశానికి రానున్నాయి. ఎక్కడా కొరత గానీ, సరఫరా సమస్య గానీ లేదు. ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని మంత్రులు చెప్పారు.

**దౌత్యం అంటే మౌనంగా ఉండటం కాదు : జాన్ బ్రిట్టాస్**

ప్రతిపక్షాలు లేవనెత్తిన కీలక అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్‌ల దురాక్రమణను వ్యతిరేకించని కేంద్ర ప్రభుత్వం, దౌత్యం అంటే మౌనంగా ఉండటమేననే అభిప్రాయాన్ని కలిగించేందుకు ప్రయత్నిస్తోందని సిపిఎం రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిట్టాస్ ఎద్దేవా చేశారు. "అమెరికా ఏకపక్ష, క్రూరమైన దురాక్రమణను ఖండించని కేంద్ర ప్రభుత్వం, జిసిసి దేశాలపై జరిగిన దాడులను ఖండిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానానికి గట్టిగా మద్దతు తెలిపింది. బ్రిక్స్ కూటమికి నాయకత్వం వహిస్తున్న భారతదేశం స్పందన అత్యంత నిరాశపరిచింది. దేశంలో ఇంధన సంక్షోభం లేదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, దానిని నిరూపించే నివేదికలు ఒక్కటి కూడా రావడం లేదు. వాస్తవం ఏమిటంటే, అన్ని రాష్ట్రాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఎల్‌పిజి సంక్షోభాన్ని పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. బ్లాక్ మార్కెటింగ్, నిల్వలను అరికట్టలేకపోతోంది. పాశ్చాత్య దేశాలలో కోటి మందికి పైగా భారతీయులు ఉన్నారు. వారి భద్రతను నిర్ధారించడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంది?

మిగతా 7లో

# 'సర్దుపోటు' కొనసాగుతుంది

- విద్యుత్ రేట్లలో మార్పు లేదు
- టారిఫ్ ఆర్డర్ విడుదల చేసిన ఎపిఇఆర్‌సి




టారిఫ్ ఆర్డర్‌ను విడుదల చేస్తున్న పి.వెంకటరామిరెడ్డి, ఇతర అధికారులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో, కర్నూలు ప్రతినిధి

విద్యుత్ వినియోగదారులకు సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్‌పిపిసిఎ) కొనసాగనున్నాయి. ట్రూఅప్, టారిఫ్ భారాలు మోపకపోయినా ఇంధన సర్దుబాటు భారాన్ని మాత్రం కొనసాగిస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన విద్యుత్ టారిఫ్‌ను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఇన్‌ఛార్జి ఛైర్మన్ పి వెంకటరామరెడ్డి, ఎపిఇఆర్‌సి కార్యదర్శి కృష్ణ, జాయింట్ డైరెక్టర్ రమణయ్యశెట్టి కర్నూలులో బుధవారం విడుదల చేశారు. ఏ వినియోగదారులకూ టారిఫ్ పెంపు లేదని, 2024-25 ట్రూఅప్ ఛార్జీల భారాన్ని కూడా నివారించామని తెలిపింది. అయితే ఇంధన సర్దుబాటు మాత్రం కొనసాగుతుందని వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో విధించిన ఇంధన సర్దుబాటు ఛార్జీలను వసూలు చేస్తామని ఎస్‌పిడిసిఎల్, సిపిడిసిఎల్ వసూలు చేయడం ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ గ్యాప్ కొంత తగ్గించుకుంటామని తెలిపాయి. కొన్నేళ్ల నుంచి వినియోగదారుల నుంచి ప్రతినెలా ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో ఎలాంటి విచారణ నిర్వహించకుండానే యూనిట్‌కు 40 పైసలకు మించకుండా వసూలు చేసిన విషయం తెలిసిందే. ఇక నుంచి ఈ 40 పైసలకు పరిమితం కాకుండా ఎంతైనా పెంచి వసూలు చేసుకోవచ్చునని ఇటీవల నియంత్రణ మండలి ఉత్తర్వులు విడుదల చేసింది. విద్యుత్ టారిఫ్ పెంపుదల లేదని చెప్పినా వినియోగదారులకు ఈ సర్దుబాటు ఛార్జీల భారం మాత్రం పడుతుంది.

2026-27 ఆర్థిక సంవత్సరంలో డిస్కమ్‌లు ప్రతిపాదించిన రూ.17,508.17 కోట్ల రెవెన్యూ లోటును రూ.15,790.57 కోట్లకు అనుమతి ఇచ్చింది. ఈ లోటును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని వెల్లడించింది. ప్రభుత్వం భరిస్తామన్న రూ.15,790.57 కోట్లలో 2024-25కు సంబంధించిన ట్రూఅప్ రూ.638.68 కోట్లు ఉంది. వాణిజ్య వినియోగదారుల నుంచి యూనిట్‌కు రూ.12.25లను రూ.9.95లకు తగ్గించింది. కుటీర పరిశ్రమలకు లోడ్ పరిమితిని 10 హెచ్‌పి నుంచి 20 హెచ్‌పికి పెంచింది. సుమారు 22 లక్షల మంది వినియోగదారులకు డిబిటి కింద ఉచితంగా లేదా రాయితీ టారీఫ్ ఉంటుందని ప్రకటించింది. రెన్యూవబుల్ ఎనర్జీ పరికరాల తయారీని ప్రోత్సహించే సోలార్ మాడ్యూల్ తయారీ పరిశ్రమకు ప్రత్యేక క్యాటగిరిని తీసుకొచ్చింది. వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్స్, ప్రింటింగ్ ప్రెస్ వినియోగదారులను వాణిజ్య కేటగిరి నుంచి పారిశ్రామిక కేటగిరికి మార్చింది. పౌల్ట్రీ ఫారాల్లో క్యాప్టివ్ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ల కోసం యూనిట్‌కు రూ.5.85 టారీఫ్‌తో ప్రత్యేక సబ్ మీటర్‌ను ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చింది. సమయ ఆధారిత (టైం ఆఫ్ డే) వేళల ధరలు మార్చేందుకు, సోలార్ రూఫ్ టాప్ వినియోగదారులకు నాన్ టెలిస్కోపిక్ పద్ధతిలో బిల్లింగ్ చేసేందుకు, గ్రీన్ పవర్ కేటగిరి తొలగించడానికి డిస్కమ్‌లు ప్రతిపాదనలను తిరస్కరించింది. విద్యుత్ ప్రమాదాలపై ఫిర్యాదులు చేసేందుకు డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో తమ వెబ్‌సైట్‌లలో ప్రత్యేక సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వాట్సాప్ నెంబర్ ద్వారా

మిగతా 7లో

## కర్నూలులో రోడ్డు ప్రమాదం

- ముగ్గురు మృతి

ప్రజాశక్తి- కర్నూలు క్రైం

కర్నూలులో ఒకే ప్రాంతంలో చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. తొలుత జరిగిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ఆ ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగుతుండగా జరిగిన మరో ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. హెడ్ కానిస్టేబుల్ సహా నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... కర్నూలు నగరంలోని చెన్నమ్మ సర్కిల్ సమీపంలో జాతీయ రహదారిపై హంద్రీ వంతెనపై తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో కర్నూలు పట్టణానికి చెందిన శేఖర్ (25)ను వేగంగా వచ్చిన గుర్తు తెలియని లారీ ఢీకొని వెళ్లిపోయింది. దీంతో, శేఖర్ అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా చేరుకొని ఆ ప్రమాదంపై పోలీసులు విచారణ చేస్తున్న సమయంలో గ్రానైట్ లోడుతో అతివేగంగా దూసుకొచ్చిన లారీ అక్కడ ఉన్న వ్యక్తులను, పార్క్ చేసి ఉన్న మోటార్ సైకిళ్లను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో శరీన్ నగర్‌కు చెందిన బండారి కన్నా (23), గుర్తుతెలియని మరో వ్యక్తి అక్కడికక్కడే మరణించారు. కర్నూలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రఫీక్‌తోపాటు నలుగురికి గాయపడ్డారు.

# పొగాకు వేలం ప్రారంభం

- ప్రారంభ ధర సరిగా లేదని రైతుల ఆందోళన
- నాణ్యత బాగుంది : బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ



పొదిలిలో పొగాకు వేలాన్ని ప్రారంభిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ

ప్రజాశక్తి- పొదిలి (మార్కాపురం జిల్లా)

పొదిలిలో పొగాకు వేలం కేంద్రాన్ని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ బుధవారం సందర్శించి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు నాణ్యత బాగుందని, గిట్టుబాటు ధర వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు ఏమైనా ఉంటే వారితో చర్చిస్తామన్నారు. ప్రారంభ ధర మంచి నాణ్యత ఉన్న పొగాకుకు కేజీ రూ.250 మాత్రమే ధర పలికింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రారంభ ధర తక్కువగా ఉండడంతో రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. గతేడాది రూ.280 ప్రారంభ ధరతో రూ.350 వరకు గ్రేడ్ వన్ పొగాకును వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈసారి ప్రారంభ ధర నిరాశజనకంగా ఉండడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకతో పోలిస్తే ధర పెరుగుదలలో పెద్దగా తేడా లేకపోవడం, ఈ ఏడాది పెట్టుబడులు అధికం కావడంతో గిట్టుబాటు కాదని, ప్రారంభంలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే, రాబోయే రోజుల్లో ధర మరింత తగ్గే అవకాశం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. కనీసం రూ.250 నుంచి రూ.300 వరకు ఇస్తేనే అప్పులు లేకుండా బయటపడతామని అంటున్నారు. ప్రకాశం జిల్లా కందుకూరులోని 26వ పొగాకు వేలం కేంద్రంలోనూ బుధవారం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. రైతులు 18 బేళ్లను మొదటి రోజు అమ్మకానికి ఉంచారు. కిలో రూ.250కు వ్యాపారులు కొనుగోలు చేశారు.

సంపాదకీయం

# వాస్తవాల విస్మరణ

ఒక్కసారి దళిత కులాల్లో పుట్టిన తరువాత, నిజానికి తల్లి కడుపులో జీవం పోసుకోగానే ప్రారంభమయ్యే వివక్ష చనిపోయేంత వరకు, ఆ మాటకొస్తే ప్రాణాలు విడిచిన తరువాత కూడా వెంటాడుతూనే ఉంటుంది. ఆ వ్యక్తి ఎంత విజ్ఞానం పొందినా, ఏ హోదాకు ఎదిగినా, ఎంత ఆస్తి సంపాదించినా, చివరకు మతం మారినా వేయి పడగల విషనాగు విషం చిమ్ముతూనే ఉంటుంది. ఏ మాత్రం అవకాశం దొరికినా కాటు వేయడానికి పొంచే ఉంటుంది! మేథో సంపన్నులు, అత్యున్నత పదవుల్లో ఉన్న వారు సైతం వివక్షకు గురైన సందర్భాలు కోకొల్లలు! క్షేత్ర స్థాయిలో అడుగడుగునా కనిపించే ఈ వాస్తవాలను విస్మరించిన ఫలితమే దళిత క్రిస్టియన్ల విషయమై సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు! హిందువులు, సిక్కులు, బౌద్ధులు కాకుండా వేరే మతాన్ని అనుసరించే ఏ వ్యక్తినైనా షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారిగా గుర్తించలేమని, మతం మారిన మరుక్షణమే షెడ్యూల్ కుల గుర్తింపు కోల్పోతారంటూ అత్యున్నత న్యాయస్థానం తీర్పు చెప్పడం దురదృష్టకరం! మతం మారిన తరువాత కూడా కుల గజ్జితో వెంటాడే మనువు మానస పుత్రులపై ఝుళిపించాల్సిన కొరడాను బాధాసర్పద్రష్టుల పైనే ప్రయోగించడం ఎంత వరకు సబబు?

హిందూ మతంలో తమపై చోటుచేసుకుంటున్న అమానుష హింస నుండి తప్పించుకోవడానికే అనేక నిమ్నకుల సమూహాలు మతం మారిన, మారుతున్న మాట ఎంత వాస్తవమో, కుల రక్కసి అక్కడ కూడా వెంటాడుతున్న మాట అంతే వాస్తవం. దీనికి వారు ఏ మత సాంప్రదాయాన్ని అనుసరిస్తున్నారన్నది కాదు. దళితులుగా పుట్టారన్నదే కారణం. ఈ వాస్తవాన్ని ధర్మాసనం ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదు. ఈ విష సంస్కృతి నుండి తప్పించుకోవడానికే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ హిందూ మతం నుండి బౌద్ధంలోకి మారారు. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలిస్తే ఆ బౌద్ధంలో కూడా కుల రక్కసి కాళ్లూనుకుందని, రంకెలేస్తోందని అర్ధమౌతోంది. అదే సమయంలో అత్యున్నత న్యాయస్థానం ఇతర మతాల్లోనూ చోటుచేసుకున్న అదే పరిణామాన్ని గుర్తించడానికి నిరాకరించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని తమ కన్ను సన్నలలో నడిపించే సంఫ్‌పరివారం ఇదే వైఖరితో ఉంది. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు, ఇతర సౌకర్యాలను దళిత క్రిస్టియన్లు పొందడాన్ని వ్యతిరేకించడంతో పాటు, వారిపైకి అగ్రకులస్తులను రెచ్చగొట్టడానికి ఏళ్ల తరబడి ప్రయత్నిస్తోంది. తాజా తీర్పు అటువంటి మతోన్మాద శక్తులకు ఊతంగా మారే ప్రమాదం ఉంది. అమెరికాలో భారతీయులు ఎక్కువగా నివసించే కాలిఫోర్నియా, సియాటెల్ నగరాల్లో కుల వివక్షను నిషేధిస్తూ చట్టాలు చేశారు.బ్రిటన్‌లోనూ సమానత్వ చట్టంలో కులాన్ని చేర్చారు. కెనడా కూడా కుల వివక్షను నిషేధిస్తూ చట్టం చేసింది. ఒక దేశం తరువాత మరో దేశం ఈ దురాగతంపై సమరం చేయడానికి సిద్ధమౌతుంటే మన న్యాయస్థానాలు ఆ స్ఫూర్తిని అందిపుచ్చుకోవడం పోయి, దానికి భిన్నంగా స్పందించడం దారుణం. నేరాలకు,ఘోరాలకు, అఘాయిత్యాలకు, అత్యాచారాలకు దేశ వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో బలవుతున్నది ఎవరో, వారిపై ఆ దారుణాలకు తెగబడుతున్నదెవరో సర్కారీ రికార్డులు ఒక్కసారి పరిశీలిస్తే అర్ధమవుతుంది. మతం మారినంత మాత్రాన ఈ దురాగతాలన్నీ అంతం అవుతాయనో, మారారు కాబట్టి జరిగినా ఫర్లేదనో భావించడం దారుణం.

కులం అన్నది పుట్టుకతో వచ్చే, ఒక సామాజిక, ఆర్థిక దుస్థితి! మతం మారినంత మాత్రాన ఆ దుస్థితి పోదు. దీనిని దృష్టిలో ఉంచుకునే రాజ్యాంగ నిర్మాతలు రిజర్వేషన్లు, ఇతర రక్షణ చర్యలను రూపొందించారు. ఎస్‌సి జాబితాలో ఉన్నవారందరూ ఏదో రూపంలో వివక్షకూ, అంటరానితనానికి, వేధింపులకు గురవుతూనే ఉన్నారు. ఏ మతంలోకి మారినా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అవి కొనసాగుతూనే ఉండటం మన కళ్ల ముందే ఉంది. ఈ సామాజిక, ఆర్థికాంశాలను పట్టించుకోకుండా, మత పరమైన గుర్తింపునకే సుప్రీం కోర్టు ప్రాధాన్యత ఇచ్చినట్లు కనపడుతోంది. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి, రిజర్వేషన్ల లక్ష్యాలకు విరుద్ధం! తక్షణమే కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు స్పందించాలి. మతంతో సంబంధం లేకుండా ఎస్‌సిలందరికీ రాజ్యాంగం నిర్దేశించిన ప్రయోజనాలు కొనసాగేలా తీసుకోవాలి. అందుకు అవసరమైన రాజ్యాంగ సవరణలను కూడా చేయాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించేందుకు రాజ్యాంగ బెంచ్‌కు అప్పగించాలి.

మంచి మాట



'సుదీర్ఘ ఇరవయ్యవ శతాబ్దాన్ని' అర్థం చేసుకోడానికి మనకు లెనిన్ 'సామ్రాజ్యవాదం' ప్రాతిపదికగా ఉంటుంది. కొల్లగొట్టే విస్తరణ లేకుండా పెట్టుబడిదారీ విధానం ఉనికిలో కొనసాగడం ఎలా అసాధ్యమో అది వివరిస్తుంది. లండన్‌లో, వాల్‌స్ట్రీట్‌లో వుండే పెద్ద పెద్ద ఫైనాన్స్ మార్కెట్లకు మూడవ ప్రపంచ దేశాల్లో కొనసాగుతున్న వినాశనానికి నేరుగా ఉన్న సంబంధాన్ని అది చూపించింది. కేంద్రంలో వున్న సంపన్న దేశాల విలాసవంతమైన జీవితం తక్కిన ప్రపంచపు నిష్ట దరిద్రం కొనసాగడం మీదనే ఆధారపడి వుందని అది రుజువు చేస్తోంది.

**- ఐజాజ్ అహమ్మద్,**
మార్క్సిస్టు తత్వవేత.

# 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సులు - ప్రభుత్వ దాష్టీకం

విశ్లేషణ



డా.బి.గంగారావు

రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్నుల ఆదాయం నుండి స్థానిక సంస్థలకు 2025-30 కాలానికి నిధులు బదలాయింపుపై నియమించిన రాష్ట్ర 5వ ఆర్థిక సంఘం 360 పేజీల నివేదికను 2024 డిసెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. గ్రామీణ స్థానిక సంస్థలకు 60, పట్టణ సంస్థలకు 53 మొత్తం 113 సిఫార్సులు చేసింది. ఆర్థికసంఘం చేసిన సిఫార్సులపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల (యాక్షన్ టేకెన్ రిపోర్ట్) నివేదికను మార్చి 5న రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది.

ఆర్థిక సంఘం ప్రస్తుతం స్థానిక సంస్థల ఆదాయ వ్యయాలను పరిగణనలోకి తీసుకొని ఐదేళ్ల (2025-30) కాలంలో పట్టణ స్థానిక సంస్థలకు రూ. 2016 కోట్లు (ఏడాదికి రూ.404 కోట్లు), పంచాయతీ రాజ్ సంస్థలకు రూ.7033 కోట్లు (ఏడాదికి రూ.1407 కోట్లు) మొత్తం రూ.9049 కోట్లు (ఏడాదికి రూ.1811 కోట్లు) లోటు వస్తుందని అంచనా వేసింది. ఈ మొత్తాన్ని ఏడాదికి రూ.1811 కోట్లు చొప్పున రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం నుండి రాష్ట్ర బడ్జెట్ ద్వారా స్థానిక సంస్థలకు బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. దీనిని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించకుండా తిరస్కరించింది.

ఆర్థిక సంఘం ఏడాదికి సిఫార్సు చేసిన నిధులు రాష్ట్ర సొంత ఆదాయంలో చూస్తే కేవలం 1.64 శాతం కూడా లేదు. 2025-26లో రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయం రూ.లక్షా 10 వేల కోట్లకు చేరుకుంటుంది. ఈ ఆదాయంలో స్థానిక సంస్థలకు కనీసం 20 శాతం (రూ.22 వేల కోట్లు) బదిలీ చేయాలి. కాని ఈ బదిలీలను రాష్ట్ర పాలకులు గత రెండు దశాబ్దాల నుండి చేయడం లేదు. కేరళ వామపక్ష ప్రభుత్వం 2023-24లో రూ.14,149 కోట్లు, 2024-25లో రూ.15,205 కోట్లు, 2025-26లో రూ.15,980 కోట్లు రాష్ట్ర సొంత ఆదాయం నుండి స్థానిక సంస్థలకు బదిలీ చేసింది. ఆర్థిక సంఘం ఇపుడు మన రాష్ట్రంలో ఏడాదికి కేవలం రూ.1811 కోట్లు మాత్రమే సిఫార్సు చేసింది. ఈ చిన్నపాటి మొత్తాన్ని కూడా టిడిపి కూటమి ప్రభుత్వం ఆమోదించకపోవడం స్థానిక సంస్థలను బలహీనపరచడమే అవుతుంది.

గతంలో నాల్గవ ఆర్థిక సంఘం సవరించిన తలసరి గ్రాంట్లలో ఎలాంటి మార్పు చేయకుండా వాటినే అమలు చేయాలని ఐదవ ఆర్థిక సంఘం నిధులను సిఫార్సు చేసింది. పట్టణ సంస్థలకు రూ.50, పంచాయతీలకు రూ.25, మండల ప్రజా పరిషత్‌లకు రూ.50, జిల్లా ప్రజా పరిషత్తులకు రూ.25ల చొప్పున తలసరి గ్రాంట్ లెక్కగట్టి బదిలీ చేయాలని తెలిపింది. దీనిని ఆమోదించిన కూటమి ప్రభుత్వం గత రెండేళ్ల కాలంలో మున్సిపాలిటీలకు, పంచాయతీరాజ్ సంస్థలకు ఒక్క రూపాయి కూడా తలసరి గ్రాంట్ ఇవ్వలేదు. గత వైసిపి ప్రభుత్వం కూడా నాల్గవ ఆర్థిక సంఘం సవరించిన తలసరి గ్రాంట్లు ప్రకారం నిధులు బదిలీ చేయటానికి నిరాకరించింది. ఉదాహరణకు ఏడాదికి పంచాయతీరాజ్ సంస్థలకు రూ.350 కోట్ల చొప్పున 2019-24 కాలానికి రూ.1750 కోట్లు తలసరి గ్రాంట్ల కింద ఇవ్వాలి. కానీ ఐదేళ్ల కాలానికి కేవలం రూ.584 కోట్లు మాత్రమే వైసిపి ప్రభుత్వం పంచాయతీరాజ్ సంస్థలకు చెల్లించిందని కమిషన్ ఎత్తిచూపింది. కనుక ఇప్పుడు ఐదవ ఆర్థిక సంఘం సూచించిన ప్రకారం తలసరి గ్రాంట్ల కింద నిధులు బదిలీ చేస్తారనేది అనుమానాస్పదమే.

గ్రామ పంచాయతీలలో వీధిలైట్లు, మంచినీటి సరఫరా మోటార్ల విద్యుత్ చార్జీల బకాయిలు భారీగా పెరిగిపోతున్నాయని, నెలకు సగటున రూ.85 కోట్లు, ఏడాదికి రూ.1020 కోట్లు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తున్నదని ఆర్థిక సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. విద్యుత్ చార్జీలు నివాస గృహ చార్జీల కంటే తగ్గించాలని కోరింది. అలాగే 2024 జూన్ నాటికి పంచాయతీలు రూ.5851 కోట్లు విద్యుత్ బకాయిలు పడ్డాయని, అవి తీర్చలేక పోతున్నాయని, ఈ బకాయిల్లో కనీసం రూ.3697 కోట్లు రద్దు చేయాలని ప్రతిపాదించింది. వెయ్యి లోపు జనాభా ఉన్న 1895 పంచాయతీల విద్యుత్ బిల్లులును పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సిఫార్సు చేసింది. ఏ ఒక్క దానిని ప్రభుత్వం ఆమోదించలేదు.

స్థానిక సంస్థల పరిధిలో సొంత పన్నుల ఆదాయ వనరులుగా ఉన్న వృత్తి, ప్రకటనలు, వినోదపు పన్నులను జి.ఎస్.టి వచ్చిన తర్వాత (2017 నుండి) రాష్ట్ర ప్రభుత్వం నేరుగా రాష్ట్ర ఖజానాకు తరలించుకు పోవటంపై ఆర్థిక సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పన్నులు స్థానిక సంస్థల హక్కు. రాష్ట్ర ప్రభుత్వం వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని వినియోగించుకునే అధికారం లేదని తేల్చి చెప్పింది. ఉదాహరణకు ఈ చర్య వల్ల విశాఖ నగరపాలక సంస్థ వృత్తి పన్ను ద్వారా రూ.60 కోట్లు, ప్రకటనల ద్వారా రూ.40 కోట్లు, వినోదపు పన్నుల కింద రూ.60 కోట్లు ప్రతి ఏడాది నష్టపోతున్నది. రాష్ట్రంలో అన్ని మున్సిపల్ సంస్థలు ఇదే తరహాలో ఆదాయాన్ని కోల్పోతున్నాయి. అందువల్ల ఈ పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని కేరళ రాష్ట్ర ప్రభుత్వంలాగా ఎ.పి ప్రభుత్వం కూడా స్థానిక సంస్థలకు పూర్తిగా చెల్లించాలని సిఫార్సు చేసింది. దీనిని కూడా ఆమోదించటానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాలేదు.

మోటార్ వాహన పన్నులో వాటా, సీనరేజ్ చార్జీలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించటం లేదు. వీటిని చెల్లించాలని తెలపగా ప్రభుత్వం ఆమోదించినా చెల్లిస్తుందనే గ్యారంటీ లేదు. ఎందుకంటే ఇవి స్థానిక సంస్థల పరిధి లోనివైనా గత 15 ఏళ్ల నుండి వీటిని చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వమే వాడుకుంటున్నది.

స్థానిక సంస్థల సొంత ఆదాయాల్లో ఆస్తి పన్నుతో పాటు అత్యంత ముఖ్యమైన ఆదాయ వనరు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ పై విధించే 0.5 శాతం సర్ చార్జీ. దీనిని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా స్థానిక సంస్థలకు జమ చేయాలని కమిషన్ కోరింది. కానీ గత రెండేళ్ల నుండి చంద్రబాబు ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఈ ఆదాయాన్ని స్థానిక సంస్థలకు జమ చేయ కుండా వినియోగించుకుంటూ స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్నది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ద్వారా 2024-25లో రూ.8837 కోట్లు 2025-26లో రూ.11 వేల కోట్లు (అంచనా) రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. దీని ప్రకారం సర్ చార్జీ కింద ఏడాదికి సుమారు రూ.700 కోట్లు నుండి రూ.800 కోట్లు వస్తుంది. దీనిలో 20 శాతం కూడా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు చెల్లించలేదు. అత్యధిక భాగం రాష్ట్ర ప్రభుత్వమే వాడుకుంటున్నది.

అధికారాలు, నిధులు బదలాయింపులో దక్షిణాది రాష్ట్రాలన్నిటికన్నా ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా వెనకబడి ఉందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తప్పు పట్టినట్లు కమిషన్ పేర్కొన్నది. రాజ్యాంగంలో షెడ్యూలు 11 ప్రకారం గ్రామ పంచాయతీలకు పేర్కొన్న 29 అధికారాల్లో 10, పట్టణ సంస్థలకు పేర్కొన్న 18లో 16 అధికారాలు మాత్రమే ఈ 30 ఏళ్ల కాలంలో బదిలీ చేశారని కమిషన్ చెప్పింది. 2024 మార్చి నాటికి రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థలు రూ.99,658 కోట్లు అప్పుల్లో ఉన్నాయని, ఈ అప్పులు తీర్చలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని కమిషన్ గుర్తించింది. వీటికి సరైన పరిష్కారం చూపడంలో ఆర్థిక సంఘం విఫలమైంది. వీటిని వాణిజ్య పద్ధతిలో వసూలు చేయాలని ఈ అప్పులకు ఆస్తి పన్ను ద్వారా స్థానిక సంస్థలకు వచ్చే ఆదాయానికి లింకు పెట్టి ఎస్క్రో అకౌంట్ల ద్వారా చెల్లించాలనే అభిప్రాయాన్ని వెలిబుచ్చింది. ఇది నష్టకరమైనది.

గ్రామ స్థానిక సంస్థలు పొందుతున్న మొత్తం ఆదాయం (సొంత ఆదాయం, కేంద్ర, రాష్ట్ర గ్రాంట్స్ కలిపి)లో గ్రామ పంచాయతీల సొంత ఆదాయం కేవలం 29 శాతం, మున్సిపల్ కార్పొరేషన్లు 63 శాతం, మున్సిపాలిటీలు 51 శాతం, నగర పంచాయతీలు 38 శాతం మాత్రమే ఆదాయం కలిగి ఉన్నాయని కమిషన్ తెలిపింది. కానీ దీనికిగల వాస్తవ కారణాలను నిశితంగా ఎత్తిచూపడంలో కమిషన్ విఫలం చెందింది. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు స్థానిక సంస్థల పన్నుల ఆదాయాలను రాష్ట్ర ఖజానాకు అక్రమంగా గుంజుకెళుతూ, రెండో వైపు న్యాయబద్ధంగా రాష్ట్ర పన్నుల ఆదాయం నుండి స్థానిక సంస్థలకు వాటా ఇవ్వడంలేదు. ఈ కఠోర వాస్తవాన్ని నొక్కి చెప్పకుండా స్థానిక సంస్థలపై నెపం మోపడం అన్యాయం.

ఐదవ ఆర్థిక సంఘం ప్రజలపై తీవ్ర భారాలు మోపే అనేక ప్రమాదకర సిఫార్సులు కూడా చేసింది. వీటన్నింటిని ప్రభుత్వం ఆమోదించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రజలు ఆస్తివిలువ ఆధారిత ఆస్తి పన్ను వల్ల, ప్రతి ఏడాది 15 శాతం ఆస్తి పన్ను పెంపు వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనిని గమనించి ఆస్తి పన్ను తగ్గింపునకు సిఫార్సు చేయకపోగా, పట్టణ సంస్థల్లో నివాస భవనాలకు ఆస్తి విలువలో 0.15 శాతం నుండి 0.20 శాతానికి, వాణిజ్య భవనాలకు 0.30 నుండి 0.50 శాతానికి పెంచాలని సిఫార్సు చేసింది. దీనిని ప్రభుత్వం ఆమోదించక పోయినా తీవ్ర భారంగా ఉన్న ఆస్తి పన్నును తగ్గిస్తామని, ప్రతి ఏడాది 15 శాతం పెంపును రద్దు చేస్తామని ప్రభుత్వం తెలపక పోవడం ఆందోళన కలిగిస్తున్నది.

ఆస్తి పన్నులో ప్రస్తుతం ఉన్న నివాస, వాణిజ్య కేటగిరీల్లో నివాస కేటగిరీని తిరిగి రెండుగా విభజించాలని కమిషన్ పేర్కొన్నది. నివాస గృహాల్లో ఒక గదిలో ఏదైనా చిన్న ఆఫీస్ ఉన్నా అటువంటి వాటిని మిక్స్‌డ్ కేటగిరిగా పరిగణించి వాటికి ఆస్తి పన్ను పెంచాలని కోరింది. పంచాయతీల్లో కూడా దీనిని అమలు చేయాలని తెలపగా ప్రభుత్వం ఆమోదించింది.

స్థానిక సంస్థల్లో ఖాళీ స్థలాలపై పన్ను వసూళ్లు సక్రంగా లేవని కమిషన్ విమర్శించింది. పన్ను పరిధిలో లేని ఖాళీ స్థలాలపై ప్రస్తుతం ఉన్న మూడేళ్ల పన్ను వసూళ్లను ఐదేళ్లకు పెంచాలని కోరగా రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా తొమ్మిదేళ్ళకు పన్ను వసూలు చేస్తామని తెలిపింది. వృత్తి పన్నుపై రూ.2500 సీలింగును ఎత్తివేసి వృత్తి పన్నును పెంచాలని, అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు కూడా వర్తింపజేయాలని ప్రతిపాదించింది. మంచినీటి కుళాయిలకు నీటి మీటర్లు బిగించాలని, నీటి కనెక్షన్లకు అవసరమైన నీటి సరఫరా పైపులైన్లకు అయ్యే ఖర్చు మొత్తాన్ని డిపాజిట్ల రూపంలో రాబట్టాలని, మంచి నీటి సరఫరాకయ్యే వ్యయంలో ప్రస్తుతం నీటి చార్జీల ద్వారా కేవలం 14 శాతం మాత్రమే ఆదాయం వస్తున్నదని, అందువల్ల ప్రతి రెండేళ్లకోసారి నీటి చార్జీలు పెంచాలని కమిషన్ సిఫార్సు చేయటం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. ట్రేడ్ లైసెన్స్ ఫీజులు రెండేళ్లకోసారి, భవనాల నిర్మాణ ఫీజులు భవన విలువ ఆధారితంగా మూడేళ్లకోసారి పెంచాలని కోరింది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యపు విధానం (పి.పి.పి)పై ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని, పి.పి.పి ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని, ప్రైవేటు సంస్థల నుండి పి.పి.పి పద్ధతిలో సోలార్ ఎనర్జీని పొందాలని కూడా కమిషన్ సిఫార్సు చేసింది.

రాబోయే నాలుగేళ్ల కాలంలో స్థానిక సంస్థలకు రాష్ట్ర బడ్జెట్ నుండి కొద్దిపాటి నిధుల బదిలీ ఎండమావిగానే మిగులుతుంది. రెండోవైపు స్థానిక సంస్థల ఆధీనంలోని పన్నుల ఆదాయాలను యథేచ్ఛగా రాష్ట్ర ప్రభుత్వం కొల్లగొట్టడం కొనసాగిస్తుంది. మరోవైపు స్థానిక సంస్థల మౌలిక సదుపాయాల ప్రైవేటీకరణ, పౌర సేవలు వ్యాపారీకరణ, ప్రజలపై పన్నుల భారాలను తీవ్రతరమౌతాయి.

**/ వ్యాసకర్త సెల్: 9490098792 /**



**ఐదవ ఆర్థిక సంఘం ప్రజలపై తీవ్ర భారాలు మోపే అనేక ప్రమాదకర సిఫార్సులు కూడా చేసింది. వీటన్నింటిని ప్రభుత్వం ఆమోదించింది. ఇప్పటికే ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలు ఆస్తి విలువ ఆధారిత ఆస్తి పన్ను వల్ల, ప్రతి ఏడాది 15 శాతం ఆస్తి పన్ను పెంపు వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనిని గమనించి ఆస్తి పన్ను తగ్గింపుకు సిఫార్సు చేయకపోగా, పట్టణ సంస్థల్లో నివాస భవనాలకు ఆస్తి విలువలో 0.15 శాతం నుండి 0.20 శాతానికి, వాణిజ్య భవనాలకు 0.30 నుండి 0.50 శాతానికి పెంచాలని సిఫార్సు చేసింది. దీనిని ప్రభుత్వం ఆమోదించక పోయినా తీవ్ర భారంగా ఉన్న ఆస్తి పన్నును తగ్గిస్తామని, ప్రతి ఏడాది 15 శాతం పెంపును రద్దు చేస్తామని ప్రభుత్వం తెలపక పోవడం ఆందోళన కలిగిస్తున్నది.**

# ఆర్సెలార్ మిట్టల్ 'భళి' - విశాఖ స్టీల్ 'బలి'

సమస్య



సి.హెచ్.నరసింగరావు

అనకాపల్లి నక్కపల్లి దగ్గర 'ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ ఇండియా' కంపెనీ శంకుస్థాపన (మార్చి 23) ఆర్భాటంగా జరిగింది. 2029 నాటికి 8.2 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని స్టీల్‌ప్లాంట్ ప్రారంభిస్తుందని ప్రకటించారు. రూ.1.5 లక్షల కోట్లతో 24 మి.మె.టన్నుల ఉత్పత్తికి పెంచి లక్ష మందికి ఉపాధి కల్పిస్తారని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు. మిట్టల్ యాజమాన్యంతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ముచ్చట్లు అందరూ వీడియోలో చూశాం. నక్కపల్లి దగ్గర స్వాధీనం చేసుకున్న రెండు వేల ఎకరాల్లో 24 మి.ట ఉత్పత్తి చేయడం ప్రపంచ వింత అవుతుంది. నక్కపల్లిలో స్టీల్‌ప్లాంట్ ప్రారంభించి 20 వేల ఎకరాల భూమి ఉన్న విశాఖ స్టీల్‌ను కబ్జా చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిట్టల్‌తో కుట్ర చేస్తున్నాయి. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని సిక్ ప్లాంట్‌గా మారుస్తున్నాయి.

ఏ పరిశ్రమలు అభివృద్ధి కావాలన్నా ప్రభుత్వ విధానాలే మూలం. ప్రైవేటీకరణ పేరుతో దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాన్ని మోడీ, చంద్రబాబు జోడీ అమలు చేస్తున్నది. అందులో భాగంగా ఆర్సెలార్ మిట్టల్, జపాన్ నిప్పన్ ద్వయానికి సుమారు రూ.25 వేల కోట్ల రాష్ట్ర సంపదను హారతి పళ్లెంలో పెట్టి సమర్పించడం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ద్రోహం చేయడమే. భూములను చౌకగా ఇవ్వడం, ఎన్.ఎం.డి.సి నుంచి గనులు ఇప్పించడం, నక్కపల్లి పోర్టును మిట్టల్‌కు కట్టబెట్టడం, విశాఖ స్టీల్‌కు విశాఖ ప్రజలకు నీరందించే 'ఏలేరు కాలువ' నుంచి 30 యం.జి.డి ల నీటిని మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు మళ్లించడం, 30 సంవత్సరాలు జీఎస్టీని రద్దు చేయడం, అన్నిటి కంటే ముఖ్యంగా యూనిట్ విద్యుత్తుకు ఒక్క రూపాయి వసూలు చేయడం ఏ విధంగా సబబు అవుతుంది? మరోవైపున 35 సంవత్సరాల నుంచి సమర్థవంతంగా నడుస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులను కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధించకపోవడం ఘోరం. విశాఖ స్టీల్‌కు సొంత గనులు ఉంటే దేశంలోనే నెంబర్ వన్ స్టీల్ అవుతుంది. విశాఖ స్టీల్ నాణ్యత వల్ల విశాఖ స్టీల్ ఒక్కటే వరుసగా నాలుగు సంవత్సరాలు విదేశీ ఎగుమతులు చేసి లాభాలు ఆర్జించింది. కానీ 2021లో విశాఖ స్టీల్‌ను నూరు శాతం ప్రైవేట్‌కు అమ్మాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినప్పటి నుంచి ఎగుమతులు ఆగిపోయాయి.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 2021లో కోక్ ఓవెన్ డిపార్ట్‌మెంట్‌లో నిర్మించాల్సిన ఆరవ బ్యాటరీని ఇంతవరకు నిర్మించలేదు. మిగిలిన ఐదు బ్యాటరీలలో నిర్వహణ సక్రమంగా లేక రోజుకు 420 పుషింగ్‌ల సామర్థ్యం ఉన్న కోక్ ఓవెన్ బ్యాటరీలు బలహీనమై 280 పుషింగ్‌లకు ఉత్పత్తి పడిపోయింది. కోక్ ఓవెన్ గ్యాస్ తగ్గడంతో మొత్తం మిల్స్ ఫర్నేష్‌లో ఉత్పత్తి 70 శాతానికి తగ్గింది. ఈ కారణంగా స్టీల్ రాడ్లు తయారు చేయలేక బిలెట్ల రూపంలో అమ్మడం వల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టపోతున్నది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు లేక ఇనుప ఖనిజాన్ని మార్కెట్లో అత్యధిక ధరలకు కొనడంతో ముడి ఖనిజం కొనుగోలు వ్యయం 74 శాతానికి పెరిగింది. సెయిల్‌లో ముడి ఖనిజం కొనుగోలు వ్యయం 48 శాతంగా వుంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ అప్పులపై వడ్డీ రేటు 10 శాతం చెల్లిస్తోంది. సెయిల్‌కు 3.4 శాతం వడ్డీ రేటుగా ఉంది. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం కావాలని విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై వేసిన భారాలు. 2025-26న కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్ సుమారు రూ.1,800 కోట్లు నష్టాలు భరించింది. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ద్వారా ప్యాకేజి ఇప్పించి లాభాల్లోకి తెప్పించామని తప్పుడు ప్రకటనలు చేస్తున్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికవర్గంపై తీవ్రంగా దాడి కొనసాగుతోంది. పనిచేస్తున్న వారిని పూర్తిగా నిరుత్సాహపర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. పర్మినెంట్ కార్మికుల నియామకాలు గత ఆరేళ్ల నుంచి లేవు. సుమారు 50 శాతం మందిని ఉద్యోగాల నుంచి రిటైర్మెంట్, వి.ఆర్.ఎస్ పేరుతో యాజమాన్యం బయటికి నెట్టివేసింది. ప్లాంట్‌లో ముగ్గురు కార్మికులు పని చేయాల్సిన మూడు యంత్రాలను ఒకే కార్మికుడు నడుపుతున్నాడు. అయినా బయోమెట్రిక్ పద్ధతితో ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా గైర్హాజరు వేస్తున్నారు. ఆరు వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం అక్రమ పద్ధతిలో తొలగించింది. నోటీసులు ఇవ్వకుండా, నష్టపరిహారం చెల్లించకుండా బయోమెట్రిక్ నుంచి పేర్లు తొలగించి మెయిన్ గేట్ నుంచి పనుల్లోకి రాకుండా నిలిపివేశారు. మాట్లాడితే చార్జిషీట్లు, వార్నింగ్ లెటర్లు ఇస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఎమర్జెన్సీ వాతావరణం నెలకొంది. అసలు జీతాల్లో సగం జీతాలే చెల్లిస్తున్నారు.

కార్మికవర్గ ఆర్థిక మూలాలను కేంద్ర ప్రభుత్వం కావాలని దెబ్బతీసింది. పొగ పెట్టి పొమ్మన్నట్లుగా ఉన్న జీతాలు, హెచ్.ఆర్.ఎ, బోనస్, ఇన్సెంటివ్, లీవ్ జీతాలు, లోన్లు గత ఐదేళ్ల నుంచి పూర్తిగా కార్మికులకు చెల్లించకుండా నిలిపివేసింది. అన్ని ప్రభుత్వ రంగాలకు వేతన ఒప్పందాలు జరిగినా, విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 2017 జనవరి 1వ తేదీ నుంచి అమలు కావాల్సిన వేతన ఒప్పందం ఆగిపోయింది. దీనివల్ల పర్మినెంట్ కార్మికులు, ఆఫీసర్లు, కాంట్రాక్ట్ వర్కర్లు సగం జీతాలకే పనిచేస్తున్నారు. ఇప్పుడు పని చేస్తున్న కార్మికులు, ఆఫీసర్లను తొలగించి తక్కువ వేతనాలకు కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రైవేటు వారికి అప్పగించడానికే కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలుచేస్తున్నది. ప్రైవేట్ యాజమాన్యాలకు లాభాలు రావాలంటే ఉన్న కార్మికులను తొలగించాలి అనే విధానాన్ని కేంద్రం అమలుచేస్తున్నది. అందుకోసమే ప్రైవేటీకరించే ముందు ఈ పద్ధతులన్నీ కేంద్ర ప్రభుత్వం పథకం ప్రకారం అమలుచేస్తున్నది. ఎన్ని ఇబ్బందులున్నా విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి తగ్గకుండా విశాఖ స్టీల్‌ను కాపాడుకోవడానికి కార్మికవర్గం తీవ్రంగా కృషి చేస్తున్నది. కాని ఉత్పత్తి కంటే కార్మికులను తొలగించడమే ముఖ్యమని ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నది. ఈ తప్పుడు పద్ధతులు ఆపి కార్మిక హక్కులను అమలు చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత.

**/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /**

**ప్రైవేటీకరణ పేరుతో దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాన్ని మోడీ, చంద్రబాబు జోడీ అమలు చేస్తున్నది. అందులో భాగంగా ఆర్సెలార్ మిట్టల్, జపాన్ నిప్పన్ ద్వయానికి సుమారు రూ.25 వేల కోట్ల రాష్ట్ర సంపదను హారతి పళ్లెంలో పెట్టి సమర్పించడం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ద్రోహం చేయడమే. భూములను చౌకగా ఇవ్వడం, ఎన్.ఎం.డి.సి నుంచి గనులు ఇప్పించడం, నక్కపల్లి పోర్టును మిట్టల్‌కు కట్టబెట్టడం, విశాఖ స్టీల్‌కు విశాఖ ప్రజలకు నీరందించే 'ఏలేరు కాలువ' నుంచి 30 యం.జి.డి ల నీటిని మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు మళ్లించడం, 30 సంవత్సరాలు జీఎస్టీని రద్దు చేయడం, అన్నిటి కంటే ముఖ్యంగా యూనిట్ విద్యుత్తుకు ఒక్క రూపాయి వసూలు చేయడం ఏ విధంగా సబబు అవుతుంది? మరోవైపున 35 సంవత్సరాల నుంచి సమర్థవంతంగా నడుస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులను కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధించకపోవడం ఘోరం.**




# నా కంచంలో విషం కక్కకండి!

లేఖ

**గౌరవనీయులైన ప్రవచనకర్త గారికి,**

నేను ఒక పేద బిడ్డను. పొద్దున్నే మా అమ్మ కూలి పనులకు, నాన్న పొలం పనులకు వెళ్తే... ఖాళీ కడుపుతో, పుస్తకాల సంచి తగిలించుకుని బడికి వెళ్లే వేలాది మంది పిల్లల్లో నేనూ ఒకడిని. మీరు ఇటీవల మా 'మధ్యాహ్న భోజనం' గురించి, మాకు పెట్టే 'గుడ్డు' గురించి చేసిన వ్యాఖ్యలు విని నా గుండె తరుక్కుపోయింది. అందుకే ఈ లేఖ రాస్తున్నాను.

**అయ్యా!**

''పిల్లలకు భోజనం పెట్టడమేంటి? వాడు చదువుతాడా, శోభనం పెళ్లికొడుకులా మంచమెక్కి కూర్చుంటాడు'' అని మీరు అన్నప్పుడు... మీకు మా ఆకలి కనిపించలేదా? లేక మా ఆకలిని అవహేళన చేసే అహంకారమా?

**మీకు కొన్ని నిజాలు చెప్పాలి...**

- మేము బడికి వచ్చేది కేవలం చదువు కోసం మాత్రమే కాదు, ఆ ఒక్క పూట మా కడుపు నిండుతుందనే ఆశతో కూడా. కడుపులో ఆకలి మండుతుంటే అక్షరాలు మెదడుకు ఎక్కవు. మాకు పెట్టే ఆ ఒక్క గుడ్డు మా దేహానికి బలాన్ని, రేపటి మీద నమ్మకాన్ని ఇస్తుంది.
- దప్పళం, నెయ్యి, వంకాయ వేపుడు అంటూ నోరూరించే వంటకాల గురించి ప్రవచనాలు చెప్పే మీకు...ఒక్క పూట నీళ్ల చారు, ముతక అన్నం తింటేనే 'శోభనం మంచం' గుర్తొచ్చిందా? మరి వేల రూపాయల ఫీజులు కట్టి, పంచభక్ష్య పరమాన్నాలు తింటూ కార్పొరేట్ స్కూళ్లలో చదివే సంపన్న వర్గాల పిల్లల గురించి మీరెందుకు ఇలాంటి మాటలు అనరు?
- తరతరాలుగా రాజుల దగ్గర, జమీందార్ల దగ్గర అగ్రహారాలు, భూదానాలు, తిండి, బట్టలు ఉచితంగా పొంది చదువుకున్న చరిత్ర మీది కదా! మరి ఈ రోజు కష్టజీవుల బిడ్డలకు ప్రభుత్వం ఒక పూట అన్నం పెడితే మీ కడుపు ఎందుకు మండుతోంది?

**మాకు అర్థమవుతోంది...**

మీరు కక్కేది మాటలు కాదు, విద్వేషం. మేము చదువుకుంటే మీకు సేవ చేసేవారు ఉండరనే భయం మీది. మేము జ్ఞానవంతులమైతే మీ అబద్ధాలను, మీ ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తామనే ఆందోళన మీది. రాజ్యాధికారంలో, ఉద్యోగాల్లో మేము వాటా అడుగుతామనే భవిష్యత్తు మీకు కనిపిస్తోంది. అందుకే మా కంచంలో విషం కక్కుతున్నారు.

రాముడు మాంసం తిన్నాడని చెప్పే మీ నోరు...పేద పిల్లలు గుడ్డు తింటే ఎందుకు విరుచుకుపడుతోంది? ఇది కేవలం ఆహారం మీద విమర్శ కాదు, కింది కులాల పిల్లలు చదువుకోకూడదనే మీ లోపలి కసి.

చివరిగా ఒక్క మాట...

మీరు చెప్పే నీతి శాస్త్రాల కన్నా, మా ఆకలి తీర్చే అన్నం గిన్నె గొప్పది. మీ విద్వేషపు మాటలు మా చదువును ఆపలేవు. మేము చదువుకుంటాం...మీలాంటి వారి అహంకారాన్ని ప్రశ్నించేందుకైనా మేము గొప్పగా ఎదుగుతాం. కనీసం ఇప్పటికైనా ఆకలిని గౌరవించడం నేర్చుకోండి.

**ఇట్లు,**
ఆకలిని భరిస్తూ అక్షరాన్ని ప్రేమిస్తున్న...
**ఒక పేద విద్యార్థి.**



## ట్రాన్స్‌జెండర్ల బిల్లును ఉపసంహరించాలి

- కేంద్రాన్ని కోరిన సుప్రీం కమిటీ

**న్యూఢిల్లీ :** లింగ స్వయం నిర్ణయాధికారం హక్కును తొలగించిన ట్రాన్స్‌జెండర్ల సవరణ బిల్లును ఉపసంహరించాల్సిందిగా సుప్రీం కోర్టు నియమించిన కమిటీ కేంద్రాన్ని కోరింది. 2019 నాటి చట్టానికి ఏ సవరణలైనా తీసుకురావడానికి ముందుగా విస్తృతంగా ట్రాన్స్‌జెండర్ల కమ్యూనిటీతో చర్చలు జరపాలని ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆశా మీనన్ నేతృత్వంలోని కమిటీ కోరింది. ఈ బిల్లు నిబంధనలు 2014 నాటి నల్సా తీర్పుకు వ్యతిరేకంగా వున్నాయని పేర్కొంటూ కమిటీ ఒక తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపింది. జస్టిస్ ఆశా మీనన్ బుధవారం కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి వీరేంద్ర కుమార్‌కు లేఖ రాశారు. కమిటీ సభ్యులు తీర్మానం ఆమోదించిన విషయాన్ని తెలియచేశారు. ట్రాన్స్‌జెండర్ల కమ్యూనిటీలను ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చే యత్నాలకు ఈ సవరణలతో గట్టి ఎదురు దెబ్బ తగిలిందని కమిటీ ఛైర్‌పర్సన్ చెప్పారు.

## చమురు ధర 150 డాలర్లకు పెరిగితే ఇక ఆర్థిక మాంద్యమే ?

- బ్లాక్ రాక్ సిఇఒ హెచ్చరిక

**లండన్ :** పశ్చిమాసియాలో చెలరేగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం నెలకొంది. పైగా చమురు ధరలు పెచ్చరిల్లుతున్నాయి. ఈ పరిస్థితుల్లో చమురు ధరలు బ్యారెల్‌కు 150డాలర్లకు చేరితే ఇక ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి జారుతుందని అంతర్జాతీయ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ బ్లాక్ రాక్ సిఇఓ ల్యారీ ఫింక్ హెచ్చరించారు. ఈ యుద్ధం ఇలాగే కొనసాగుతూ వుంటే ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలన్నీ అతలాకుతలమవక తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిణామాలు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయో ఇప్పుడే అంచనాకు రాలేమని ఆయన అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. ఈ యుద్ధం ముగిసి, ఇరాన్‌పై ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రపంచం ఆమోదించినట్లైతే చమురు ధరలు యుద్ధం ముందు రోజు కంటే కూడా దిగువకు పడిపోతాయని ఆయన పేర్కొన్నారు.

# యుడిఎఫ్ దిగజారుడు రాజకీయాలు

- వ్యక్తిగత దాడులకు పాల్పడుతోంది
- ఇది సామాజిక, రాజకీయ పతనమే
- యుడిఎఫ్ చర్యలపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శ



**తిరువనంతపురం :** సిపిఎం నేత, కాయంకుళం అసెంబ్లీ స్థానంలో ఎల్‌డిఎఫ్ అభ్యర్థి శ్రీమతి యు.ప్రతిభపై యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) చేస్తున్న "స్త్రీ ద్వేషపూరితమైన, పరువునష్టం" ప్రకటనలను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన చేశారు. ఎల్‌డిఎఫ్ అభ్యర్థి శ్రీమతి ప్రతిభ వ్యక్తిత్వ హననానికి యుడిఎఫ్ చేస్తున్న విషపూరితమైన ప్రయత్నాలు ఆ కూటమి సామాజిక, రాజకీయ పతనాన్ని ప్రతిబింబిస్తున్నాయని విజయన్ ఆ ప్రకటనలో విమర్శించారు. ఎల్‌డిఎఫ్‌ను రాజకీయంగా ఎదుర్కొనలేక ప్రత్యర్థులు, వారి కుటుంబాలపై యుడిఎఫ్ వ్యక్తిగత దాడులకు దిగజారుతోందని అన్నారు. పైగా ఓటర్ల ముందు వుంచడానికి యుడిఎఫ్‌కు విశ్వసనీయమైన ఎజెండా కూడా లేదన్నారు.




మహిళల హక్కులు, లింగ సమానత్వం కోసం ప్రతిన చేసే ప్రతిపక్ష నేత వి.డి.సతీశన్, బాధితుల పక్షాన కాకుండా వేటగాళ్ల పక్షాన నిలుచున్నారని విజయన్ వ్యాఖ్యానించారు.

శ్రీమతి ప్రతిభపై యుడిఎఫ్ దాడి మహిళపై దాడి అని ఆయన పేర్కొన్నారు. మహిళలు కూడా మనుష్యులేనని, వారికి విశిష్టమైన వ్యక్తిత్వాలు వుంటాయని, గౌరవం, జీవించే హక్కు, ఆత్మాభిమానం వంటివి వుంటాయని ఆమోదించడానికి కూడా విముఖత చూపే వ్యక్తులు యుడిఎఫ్‌లో ఎక్కువగా వున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు.

కాయంకుళంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎం.లిజూ కోసం యుడిఎఫ్ కన్వీనర్ (ఆలప్పుజ) ఎ.ఇర్షాద్ ఎన్నికల సభలో చేసిన ప్రసంగంపై బుధవారం వివాదం రేగింది. వ్యక్తిగత, ప్రజా జీవితంలో లిజూ నీతి నిజాయితీలకు, ఒక ఎంఎల్‌ఎగా, రాజకీయ నేతగా శ్రీమతి ప్రతిభ బూటకపు స్వభావం, వ్యవహార శైలితో పోల్చడానికి ఇర్షాద్ ప్రయత్నించారు.

ప్రజా జీవితంలో వున్న ఒక మహిళ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేవిగా, ఆమెకు తీవ్రంగా పరువు నష్టాన్ని కలిగించేవిగా భావిస్తున్న వ్యాఖ్యలకు పాల్పడడం ద్వారా ఇర్షాద్ సామాజిక, సాంప్రదాయ మీడియాలో తీవ్ర విమర్శలను ఎదుర్కోనాల్సి వచ్చింది. శ్రీమతి ప్రతిభ కుమారుడిపై గతేడాది పెట్టిన, ప్రస్తుతం ఉపసంహరించబడిన నార్కొటిక్ కేసును కూడా ఇర్షాద్ తన ప్రసంగంలో ఎత్తి చూపారు.

ఈ విషయంలో యుడిఎఫ్ కానీ, ఇర్షాద్ సభ్యుడైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) గానీ ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అత్యాచారానికి సంబంధించి పలు అభియోగాలు ఎదుర్కొంటున్న, పాలక్కాడ్ కాంగ్రెస్ బహిష్కృత ఎంఎల్ఎ రాహుల్ మామ్‌కూతైల్‌కు సతీశన్, ఆయన అనుచరులు రాజకీయంగా అండ కల్పిస్తున్నారని విజయన్ మంగళవారం విమర్శించారు.

### నిజమైన ఓటర్లను తొలగించారు : మమత ఆందోళన

**మైనాగురి :** పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జీ బుధవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితా నుంచి నిజమైన ఓటర్లను తొలగించారని ఆమె తీవ్రంగా ఆరోపించారు. త్వరలో ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఓటర్ల తొలగింపుపై, ఎన్నికల ప్రక్రియపైనా ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో చేపట్టబోయే ఎన్నికలు నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరుగుతాయా అని ఆమె ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. పౌరుల గుర్తింపు, వారి పౌరసత్వంపైనా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. అసలు చట్టబద్ధమైన భారతీయ ఓటరుగా ఎవరిని? ఏ ప్రాతిపదికన గుర్తిస్తున్నారని ఆమె ప్రశ్నించారు. పౌరసత్వం పేరిట బిజెపి చేస్తున్న ప్రయత్నాలను ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. పౌరసత్వం పేరిట వారు నిర్బంధ శిబిరాలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. దీన్ని నా తర్వాతి తరం కూడా ఎప్పటికీ అనుమతించదు అని ఆమె వ్యాఖ్యానించారు.

### 'వంట గ్యాస్' నుంచి దృష్టి మరల్చడానికే

- నియోజకవర్గాల పునర్విభజన నాటకం : స్టాలిన్

**చెన్నై :** ప్రస్తుతం దేశంలో నెలకొన్న వంట గ్యాస్ సంక్షోభం నుంచి దృష్టి మరల్చడానికే కేంద్రం ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని ముందుకు తీసుకొచ్చిందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ విమర్శించారు. ఈ మేరకు బుధవారం నాడు స్టాలిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. వంట గ్యాస్ సిలిండర్ల సరఫరా కొరత సమస్యను కోవిడ్19 మహమ్మారి సమస్యతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పోల్చి ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న ప్రజల్లో భయాందోళనను మరింతగా పెంచారని స్టాలిన్ విమర్శించారు. ఇప్పటికే అనేక రెస్టారెంట్లు, హోటళ్లను మూసివేయడంతో అనేక మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని స్టాలిన్ తెలిపారు. అలాగే అన్నాడిఎంకెపై స్టాలిన్ విమర్శలు సంధించారు. బిజెపికి అనుగుణంగా వ్యవహరిస్తూ, ప్రజల సమస్యలపై పూర్తిగా మౌనం ప్రదర్శించే అన్నాడిఎంకె ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. గ్యాస్ సిలిండర్ల సరఫరా, విదేశాంగ విధానం రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్నాయా..అని స్టాలిన్ ప్రశ్నించారు. అయినా రాష్ట్రంలోని తమ ప్రభుత్వం తన పరిధిలోని సాధ్యమైన అన్ని చర్యలను తీసుకుంటుందని స్టాలిన్ తెలిపారు.



పార్లమెంట్ మకరద్వార్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష ఎంపీలు

## సిలిండర్లు ఖాళీ... వాగ్దానాలు గాలికి

- ఇంధన నిల్వలపై కేంద్రం అబద్ధాలు
- ఎల్పిజి సంక్షోభంపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు ఆందోళన

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధం నేపథ్యంలో దేశంలో ఎల్పిజి సరఫరా సంక్షోభంపై ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో మకరద్వార్ వద్ద ప్రతిపక్ష ఎంపిలు 'సిలిండర్లు ఖాళీ...వాగ్దానాలు ఖాళీ' అని రాసి ఉన్న భారీ బ్యానర్‌తో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎన్సిపి ఎంపి సుప్రియా సూలే, ఎస్పి ఎంపి ధర్మేంద్ర యాదవ్, సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్, సిపిఐఎంఎల్ ఎంపి సుదామ ప్రసాద్, డిఎంకె ఎంపి టి.సుమతి, జెఎంఎం ఎంపి మహువా మాజీ, ఆర్జెడి ఎంపి మీసా భారతి, శివసేన ఎంపి అరవింద్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం అబద్ధాలు చెబుతుందన్నారు. గ్రామాలు, నగరాల్లో గ్యాస్ కొరత తీవ్రంగా కన్పిస్తుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్పిజి సంక్షోభంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రతిపక్ష ఎంపిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

## కర్ణాటకలో అంగన్‌వాడీల ఆందోళన

- దిగొచ్చిన సిద్దరామయ్య ప్రభుత్వం
- రూ.183 కోట్ల గ్రాట్యుటీ విడుదలకు అంగీకారం
- గౌరవ వేతనం పెంపుదలకూ హామీ
- పోరాడి సాధించుకున్న అంగన్‌వాడీలు

**బెంగళూరు :** రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు గత రెండు రోజులుగా సెంటర్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్ వద్ద తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్నారు. వారు ఎండ, చలిని సైతం లెక్కచేయకుండా ఈ ఆందోళన చేపట్టారు. గౌరవ వేతనం పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రాలలో ఎల్‌కెజి యుకెజి తరగతులను ప్రారంభిం చాలని, కేంద్రాల మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపట్టారు. నిరసన తీవ్రతరం కావడంతో ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది.

బెంగళూరులోని మహిళా, శిశు అభివృద్ధి శాఖ కేంద్ర కార్యాలయంలో మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్ అధ్యక్షతన ఒక ముఖ్యమైన సమావేశం జరిగింది. ఈ సమా వేశంలో అంగన్‌వాడీ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొని తమ డిమాండ్లను వినిపించారు. పెరుగుతున్న ధరల ఈ కాలంలో, ప్రస్తుతం చెల్లిస్తున్న గౌరవ వేతనం జీవనం సాగించడానికి సరిపోవడం లేదు. అందువల్ల, గౌరవ వేతనాన్ని గణనీయంగా పెంచాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. దీనికి సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడతామని మంత్రి హామీ ఇచ్చారు.

**ఆర్థిక సహాయం, గ్రాట్యుటీ విడుదల**

దశాబ్దాలుగా అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్‌గా ఉన్న గ్రాట్యుటీ అంశానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. 2011 నుండి మార్చి 2023 వరకు పదవీ విరమణ చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రాట్యుటీని రూ. 183 కోట్లు విడుదల చేయడానికి సమావేశంలో అంగీకరించారు. దీనికి అదనంగా, మహిళా, శిశు అభివృద్ధి శాఖ ద్వారా ప్రారంభించనున్న ఐదువేల ఎల్‌కెజి, యుకెజి కేంద్రాలకు గ్రాంటుగా రూ. 60 కోట్లు విడుదల చేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఈలోగా, విద్యాశాఖ ఇప్పటికే ప్రారంభించిన 7,500 ఎల్‌కెజి, యుకెజి కేంద్రాలు మినహా, ఏ ప్రభుత్వ పాఠశాలల్లోనూ కొత్త ఎల్‌కెజి తరగతులను తెరవకూడదని నిర్ణయించారు. అలాగే, ఒకే ప్రాంగణంలో అంగన్‌వాడీ, ఎల్‌కెజి కేంద్రాలు ఉండటం వల్ల కలిగే ప్రభావాలపై సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అనేక అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు లేదా శిథిలావస్థలో ఉన్నాయి.

తాగునీరు, మరుగుదొడ్లు, పౌష్టికాహార నిల్వకు సరైన ఏర్పాట్లు లేకపోవడంపై సమావేశంలో చర్చించారు. దీనిపై స్పందిస్తూ, ఎన్ఆర్ఈజిఎ, విద్యాశాఖ నిధులతో పాత భవనాల మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణం దశలవారీగా ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. తీవ్ర వ్యతిరేకత ఎదురవడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లకు బదు లుగా నగదు అందించాలన్న ఉత్తర్వును ఉపసంహరిం చుకు న్నారు. ఇకపై గుడ్లను యథావిధిగా పంపిణీ చేస్తారు. రాబోయే మూడు నెలల్లోగా అంగన్‌వాడీ కార్యకర్తల ఖాళీలను భర్తీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్‌లోని సహాయకుల పోస్టుల నియామక నిబంధనలలో అవసరమైన మార్పులు చేయడానికి అంగీకరించారు. శాఖా విభాగం నిర్వహించిన సమావేశాల్లో, ఉద్యోగులకు కుర్చీలు, కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు, కేంద్రాలకు సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతను, పప్పుధాన్యాల పరిమాణాన్ని పెంచాలని నిర్ణయించారు.

# మధ్యాహ్న భోజన పథక కార్మికులకు కేరళలోనే అత్యధిక వేతనం

- రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో



దేశంలో పాఠశాల మధ్యాహ్న భోజన పథక కార్మికులకు అత్యధిక గౌరవ వేతనం చెల్లించే రాష్ట్రం కేరళేనని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. రాజ్యసభలో ఎంపి జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం అందించే రూ.1,000కు అదనంగా కేరళ రూ.11,000 గౌరవ వేతనం చెల్లిస్తోందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ విధంగా కేరళలోని మధ్యాహ్న భోజన కార్మికులు మొత్తం రూ.12,000 గౌరవ వేతనం పొందుతున్నారు. 2026-2027 బడ్జెట్‌లో రోజుకు రూ.75 పెంపుతో, నెలవారీ గౌరవ వేతనం రూ.13,500కు పెరిగింది. ఇందులో రూ.12,500 రాష్ట్ర వాటా కాగా, పథక కార్మికుల గౌరవాన్ని కాపాడే విధంగా వారికి నిరంతరం మంచి వేతనాలు చెల్లించాలన్న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ సంకల్పానికి ఇది ఒక ఉదాహరణ అని జాన్ బ్రిట్టాస్ పేర్కొన్నారు. అదే సమయంలో, పథక కార్మికుల వేతనాలను పెంచడం పట్ల కేంద్ర ప్రభుత్వ ఉదాసీనత నిరాశ కలిగిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

పథకం మార్గదర్శకాల ప్రకారం వంట సహాయకులకు రూ. 1,000 గౌరవ వేతనం సరిపోతుందని కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆయన తప్పుపట్టారు. ఈ రూ. 1,000 కేంద్ర వాటా అని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, చాలా రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం రూ. 600 కేటాయిస్తుందని విమర్శించారు. మిగిలిన రూ. 400ను ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు చెల్లిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రాలు కోరుకుంటే, అదనపు మొత్తం ఇచ్చి మొత్తం గౌరవ వేతనాన్ని పెంచుకోవచ్చు. కేరళతో సహా పలు రాష్ట్రాలు అలా చేస్తున్నాయని విద్యాశాఖ చెబుతోంది. ఇతర రాష్ట్రాలు చెల్లించిన అదనపు గౌరవ వేతనం వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రూ.2,700, హిమాచల్ ప్రదేశ్ రూ. 3,500, పశ్చిమ బెంగాల్ రూ. 1,000, ఉత్తర ప్రదేశ్ రూ.1,000, రాజస్థాన్ రూ.1,143, ఒరిస్సా రూ. 1,000, జార్ఖండ్ రూ. 2,000 ఇస్తున్నాయి.

### ఇబ్బందుల్లో బహ్రెయిన్‌లో జెఇఇ విద్యార్థులు

- కేంద్ర మంత్రికి జాన్ బ్రిట్టాస్ లేఖ

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో బహ్రెయిన్, గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న భారతీయ విద్యార్థులు జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జెఇఇ) రాయడంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం రాజ్యసభ సభ్యులు డా. జాన్ బ్రిట్టాస్ కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు తక్షణ జోక్యం కోరుతూ బుదవారం లేఖ రాశారు. జెఇఇ మెయిన్ 2026 (సెషన్ 2) కోసం మనామా (బహ్రెయిన్)ను పరీక్షా కేంద్రంగా ఎంచుకున్న విద్యార్థులకు సిటీ ఇంటిమేషన్ స్లిప్ ద్వారా హఠాత్తుగా ఆ కేంద్రం అందుబాటులో లేదని తెలిపారు. ఇప్పుడు వారిని భారత్‌లోని కేంద్రాలకు మళ్ళించడం జరుగుతోంది. దీంతో వందలాది విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తక్కువ సమయంలో అంతర్జాతీయ ప్రయాణం చేయడం ఆర్థికంగా భారంగా మారింది. భద్రతా సమస్యలు, లాజిస్టిక్ ఇబ్బందులు విద్యార్థులను వేధిస్తున్నాయి. ఐఐటి, ఎన్ఐటి లక్ష్యంగా చదివిన విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. అదనంగా, వేర్వేరు కేంద్రాల మధ్య నార్మలైజేషన్ ప్రక్రియలో అసమానతలు ఏర్పడే అవకాశం ఉందని ఆయన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. బహ్రెయిన్‌ను మళ్ళీ పరీక్షా కేంద్రంగా పునరుద్ధరించడం లేదా గల్ఫ్ ప్రాంతంలో సమీప ప్రత్యామ్నాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, నార్మలైజేషన్ ప్రక్రియలో పూర్తి సమానత్వం పాటించాలని, ఏ విద్యార్థీ నష్టపోకుండా చూడాలని బ్రిట్టాస్ లేఖలో పేర్కొన్నారు. యుద్ధంతో గల్ఫ్ దేశాల్లో ఇప్పటికే పలు సిబిఎస్ఇ బోర్డు పరీక్షలు వాయిదా పడ్డాయి లేదా రద్దయ్యాయి. అయినప్పటికీ జెఇఇ విషయంలో అధికారులు స్పష్టమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం పట్ల బ్రిట్టాస్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

## సుప్రీం తీర్పును వ్యతిరేకించిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** క్రైస్తవ మతంలోకి వెళ్లిన వారు షెడ్యూల్డ్ కాస్ట్ (ఎస్‌సి) హోదాను పొందలేరని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ బుధవారం ప్రశ్నించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాలు కాకుండా ఇతర మతాలను అనుసరించే ఏ వ్యక్తి కూడా ఎస్‌సి హోదాను పొందలేరని సుప్రీంకోర్టులో ఇద్దరు జడ్జీలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ వ్యతిరేకించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సుర్జేవాలా ఒక ప్రకటన విడుదల చేశారు. క్రైస్తవులు, ముస్లింలు, ఇతర మైనార్టీలకు ఎస్‌సి హోదాను నిరాకరిస్తూ ఇచ్చిన ఈ తీర్పు మైనార్టీల్లోని ఆర్థికంగా వెనుకబడిన ప్రజల్లో తీవ్ర ఆందోళన, అశాంతి, భయాన్ని రేకెత్తించిందని పేర్కొన్నారు. అలాగే, నిజానికి ఇదే అంశం (క్రైస్తవ, ఇస్లాం మతాల్లోకి మారిన వారికి ఎస్‌సి హోదా కల్పించడం) 2011 నుంచి సుప్రీంకోర్టులోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. మత మార్పిడి తరువాత ఎస్‌సి హోదాను మంజూరు చేయాలా.. వద్దా.. అనే ప్రశ్న సమాజంలో భారీ సంఖ్యలో ఉన్న నిరుపేద ప్రజలను ప్రభావితం చేసే 'సున్నితమైన సమస్య' అని సుర్జేవాలా అభివర్ణించారు.

# అస్పష్టమైన భయాందోళనే ఇది !

- వందేమాతరంపై హోం శాఖ సర్క్యులర్‌పై పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం

**న్యూఢిల్లీ :** ప్రజా కార్యక్రమాల్లో వందేమాతరాన్ని సంపూర్ణంగా ఆలపించాలని పేర్కొంటూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జనవరి 28న జారీ చేసిన మార్గదర్శకాలు ఎవరికీ ముప్పు కలిగించేవి కావని, అలాగే రాజ్యాంగ స్వేచ్ఛలకు భంగకరం కూడా కావని సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది.

ఇవి ఎవరికీ ముప్పు కలిగించేవి కావు, కేవలం సూచనలు మాత్రమే. జాతీయ గీతం అంటే జాతీయ గుర్తింపును వ్యక్తీకరించడమని మంత్రిత్వ శాఖ భావించింది. కానీ మీకు భిన్న అభిప్రాయం వుండొచ్చు, అయితే, మీరు అస్పష్టంగా భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారని మేం భావిస్తున్నాం. ఈ సూచనలు ఆధారంగా ఎవరైనా మిమ్మల్ని వివక్షకు గురి చేసినట్లైతే మీరు వెంటనే మా వద్దకు రావచ్చు." అని జస్టిస్ జోమాల్యా బాగ్చి పిటిషనర్ మహ్మద్ సయాద్ నూరిని ఉద్దేశించి పేర్కొన్నారు. జాతీయ గీతాన్ని ఆలపించని వారు శిక్షను అనుభవిస్తారని, లేదా తీవ్ర చర్యలు తీసుకుంటారని సర్క్యులర్ ఎక్కడా లేదని త్రిసభ్య ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్న చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. 'శిక్ష లేకపోయినా, చట్టపరమైన ఆంక్షలు లేకపోయినా ఈ గీతాన్ని ఆలపించడానికి నిరాకరించినా లేదా నిలుచోకపోయినా వారిపై అపారమైన భారం వుంటుందని పిటిషనర్ వాదించారు. "ఏమిటి ఆ భారం ? జాతీయ గీతాన్ని ఆలపించేటపుడు మీరు పాడలేదని, లేదా నిలబడలేదని పేర్కొంటూ అందుకు ప్రతిఫలంగా మీరు సంస్థను మూసివేస్తాం లేదా గుర్తింపు రద్దు చేస్తామని ఎవరైనా మీకు నోటీసులు పంపినట్లైతే మేం అర్థం చేసుకోగలం" అని చీఫ్ జస్టిస్ స్పందించారు. వాదనలు విన్న అనంతరం ఈ పిటిషన్‌ను అపరిపక్వమైనదిగా పేర్కొంటూ ఆ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది.

## మాకు ప్రాణహాని ఉంది

- కుంభమేళా మోనాలిసా
- దర్శకుడిపై విమర్శలు

**కొచ్చి :** తనకు, తన భర్తకు ప్రాణహాని ఉందని కుంభమేళా సమయంలో ఫేమస్ అయిన యువతి మోనాలిసా తెలిపారు. కేంద్రం, కేరళ, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు తమకు సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గతేడాది జరిగిన ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలోని ఫోటోల ద్వారా విశేష ప్రాచుర్యం పొందిన మోనాలిసా ఇటీవలే కేరళలో ప్రేమ వివాహం చేసుకోవడం ద్వారా మరోసారి వార్తల్లోకి వచ్చారు. తాజాగా ఆమె తన భర్తతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన ఫోటోలను, పోస్టర్లను కొందరు తగలబెడుతున్నారని, మా దంపతుల్ని హత్య చేస్తామనే బెదిరింపులు వస్తున్నాయని తెలిపారు. అలాగే ఒక దర్శకుడు తన గురించి చెడుగా మాట్లాడుతున్నారని, సినిమాలకు దూరం చేస్తానని చెబుతున్నాడని మోనాలిసా వెల్లడించారు. అయితే ఆ దర్శకుడి సినిమాల్లో నటించాలని ఎవరూ కోరుకోరని తెలిపారు. 'ఆ దర్శకుడు చాలా నీచమైన, అసహ్యకరమైన వ్యక్తి. సినిమాల పేరుతో మైనర్ బాలికలతో అసభ్యంగా ప్రవర్తిసాడు' అని విమర్శించారు. ఆ దర్శకుడి పేరు ఉచ్చరించడానికి కూడా తనకు సిగ్గుగా ఉందని అన్నారు. అలాగే, తమ ప్రేమ వివాహంపై 'లవ్ జిహాద్' అని చేస్తున్న ఆరోపణలను ఆమె ఖండించారు. ఇలాంటి ఆరోపణలు చేయవద్దని కేంద్ర, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలను ఆమె అభ్యర్థించారు. 'మేము ఒక ఆలయంలో హిందూ సంప్రదాయాల ప్రకారం వివాహం చేసుకున్నాము. ఈ దేశంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఆ విషయం తెలుసు. కానీ, ఆ దర్శకుడు సమాజంలో మతతత్వం పెరగాలని, ప్రజలు ఒకరితో ఒకరు ఘర్షణలు పడాలని కోరుకుంటున్నాడు. ఆయన మా వివాహాన్ని 'లవ్ జిహాద్' అని ముద్రవేస్తున్నాడు. నేను అన్ని మతాలను గౌరవిస్తాను' అని ఆమె తెలిపారు.

## అఖిలపక్షానికి మోడీ గైర్హాజరు

(మొదటిపేజీ తరువాయి)

యుద్ధ భయంతో తిరిగి వచ్చిన వారికి సహాయం చేయడానికి పునరావాస ప్యాకేజీని ఎందుకు రూపొందించలేదు?" అని జాన్ బ్రిట్టాస్ ప్రశ్నించారు. అఖిల పక్ష సమావేశం సంతృప్తి కరంగా లేదని కాంగ్రెస్ నేత తారిఖ్ అన్వర్ విమ ర్శించారు. తాము ప్రభుత్వం నుంచి వివరణ కోరేందుకు ప్రయత్నించామని, కానీ స్పష్టమైన వివరణ రాలేదని అన్నారు. ఈ అంశంపై రాజ్యసభ, లోక్ సభ రెండింటిలోనూ రూల్ 193, 170 కింద చర్చ జరగాలన్నది తమ డిమాండ్ అని అన్నారు. పశ్చిమాసియా సంఘర్షణలపై కేంద్ర ప్రభుత్వం స్పందించలేదన్న అభిప్రాయం తప్పు అని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ బదులిచ్చారు. ప్రభుత్వం ప్రతి రోజూ అధికారికంగా స్పందించిందని, దేశాధి నేతలతో సంప్రదింపులు జరిపిందని ఆయన తెలి పారు. మొన్న ట్రంప్ ఫోన్ చేసినప్పుడు, యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలని తాను కోరుకుం టున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారని జైశంకర్ అన్నారు. ఇరాన్, అమెరికా మధ్య చర్చలలో పాకిస్థాన్ మధ్య వర్తిత్వం పెద్ద విషయమేమీ కాదని అన్నారు. ఈ అఖిల పక్ష సమావేశంలో కాంగ్రెస్ నేతలు ముకుల్ వాస్నిక్, తారిఖ్ అన్వర్, ఎస్పీ ఎంపి ధర్మేంద్ర యాదవ్, జావెద్ అలీ, సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్, ఎల్జెపి నేత అరుణ్ భారతి, డిఎంకె ఎంపి పి.విల్సన్, ఆప్ ఎంపి సంజయ్ సింగ్, జెడియు నేత రాజీవ్ సింగ్ పాల్గొన్నారు.

# ఫైనాన్స్ బిల్లు ఆమోదం

- ఆదాయపు పన్ను విధానంలో మార్పులు
- కార్పొరేట్ల కోసమే ఫైనాన్స్ బిల్లు : ప్రతిపక్షాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 32 సవరణలతో కూడిన ఫైనాన్స్ బిల్లు-2026ను లోక్‌సభ ఆమోదించింది. ఫైనాన్స్ బిల్లు ఆమోదంతో లోక్‌సభలో బడ్జెట్ ఆమోద ప్రక్రియ పూర్తయింది. ఈ బిల్లును గురువారం రాజ్యసభ పరిశీలించనుంది. రాజ్యసభ ఫైనాన్స్ బిల్లును ఆమోదించడంతో, 2026-2027 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ సిఫార్సులకు చట్టబద్ధమైన ఆమోదం లభిస్తుంది. ఫైనాన్స్ బిల్లు ఆమోదంతో దేశ ఆదాయపు పన్ను విధానంలో గణనీయమైన మార్పులు రానున్నాయి. ఆదాయపు పన్ను శాఖ అధికారులకు మరిన్ని అధికారాలు లభిస్తాయి. ఎటువంటి కాలపరిమితి లేకుండా పాత ఆదాయపు పన్ను మదింపు కేసులను కూడా తిరిగి తెరిచే అధికారం అధికారులకు ఉంటుంది. సాంకేతిక సమస్యల కారణంగా కోర్టులు లేదా ట్రిబ్యునల్స్ ద్వారా చెల్లనివిగా ప్రకటించబడిన కేసుల్లో విచారణను పునఃప్రారంభించడానికి సహాయపడే నిబంధనలు కొత్త ఫైనాన్స్ బిల్లులో ఉన్నాయి. ఇది కోర్టులను తప్పించుకునే చర్య అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫైనాన్స్ బిల్లులోని నిబంధనలు కేవలం కార్పొరేట్లకు మాత్రమే సహాయపడతాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి. అలాగే లోక్‌సభలో ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల బిల్లు, ట్రాన్స్‌జెండర్ వర్గం హక్కులను ఉల్లంఘించే బిల్లు ఆమోదం పొందాయి.

## 'సర్దుపోటు' కొనసాగుతుంది

(మొదటిపేజీ తరువాయి)

ఫిర్యాదు చేసే సదుపాయం తీసుకురావాలని తెలిపింది. డిస్కంల లాగా ఏ ప్రయివేటు కంపెనీలూ సేవలు అందించలేవని ఎపిఇపిడిసిఎల్ డైరెక్టర్ టివి సూర్య ప్రకాష్ తెలిపారు. అర్ధరాత్రి అయినా డిస్కంల సిబ్బంది వినియోగదారులకు సేవలు అందించేందుకు పని చేస్తున్నాయన్నారు. కమిషన్ సూచనలు పాటించి ఉత్తమ సేవలు అందిస్తామని తెలిపారు. సిపిడిసిఎల్ డైరెక్టర్ టివిఎస్ఎన్ మూర్తి, ఎస్‌పిడిసిఎల్ పి అయూబ్ ఖాన్ మాట్లాడుతూ.. కమిషన్ సూచనల మేరకు ముందుకు వెళ్తామన్నారు. టారిఫ్ విడుదల కార్యాక్రమంలో ఎపిఇఆర్‌సి జాయింట్ డైరెక్టర్ డి.రమణయ్యశెట్టి, కమిషన్ సెక్రటరీ పి.కృష్ణ పాల్గొన్నారు.

## 'వ్యవసాయ' పాలన.. గందరగోళం

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయశాఖలో ఎదురైన తలనొప్పులు, అధికారుల సహాయ నిరాక రణ, మంత్రి, ఉన్నతాధికారులు పట్టిం చుకోకపోవడమేనని తెలుస్తోంది. అక్కడి నుంచి బదిలీ కోసం ప్రయత్నిస్తున్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

**పోస్టింగ్‌ల దందా!**

ప్రమోషన్లు, పోస్టింగ్‌ల విషయంలో దందా నడుస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. సరిగ్గా డైరెక్టర్ జిలానీ సెలవులో వెళ్లిన రోజునే డిపార్ట్‌మెంట్ ప్రమోషన్స్ కమిటీ (డిపిసి) సిఫారసులకనుగుణంగా 13 మంది డిడిలకు ఆడ్‌హక్ జెడిఎలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వు లొచ్చాయి. మూడు జిల్లాలు, 'ఎటిఎంఎ' పి.డి. సహా పది పోస్టుల వరకు ఖాళీ ఉన్నా పదోన్నతులు కల్పించి కూడా పోస్టింగ్‌లివ్వకుండా రోజులపర్యంతం నానబెట్టడానికి వ్యవసాయ మంత్రి పేషీలో కొందరు కీలక వ్యక్తులు కారణమని ఆరోపణలొస్తున్నాయి. అక్కడ క్లియర్ అయితేనే పోస్టింగ్‌లొస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికి ముగ్గురు అధికారులకు పోస్టింగ్‌లివ్వగా వారు సైతం విధుల్లో చేరలేదని సమాచారం. తనకు చెప్పకుండా తన జిల్లాకు జెడిఎగా ఒకరిని వేయడంపై రాయలసీమకు చెందిన ఒక మంత్రి, వ్యవసాయశాఖ ఉన్నతాధికారిపై అసహనం వ్యక్తం చేయగా, ఆ అధికారి చేతులెత్తేసినట్లు తెలిసింది. దాంతో వ్యవసాయ మంత్రి పేషీకి నేరుగా ఆ మంత్రి ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ విధంగా ఇంకా ఒకరిద్దరు మంత్రులు జెడిఎ పోస్టింగ్‌లపై అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం.

## ఇరాన్‌కు ట్రంప్ 15 డిమాండ్లు!

(మొదటిపేజీ తరువాయి)

దాడులు బుధవారం కూడా కొనసాగాయి. టెహరాన్‌లోని ఇరాన్ రక్షణ శాఖ నిర్వహిస్తున్న నావికా దళానికి చెందిన క్రూయిజ్ క్షిపణి కేంద్రంపై దాడి చేసినట్లు ఇజ్రాయిల్ మిలటరీ బుధవారం ప్రకటించింది. ఐడిఎఫ్ నిఘా వర్గాల సమాచారం మేరకు ఇజ్రాయిల్ వైమానిక దళం ఈ దాడులకు పాల్పడినట్లు మిలటరీ తెలిపింది. మరోవైపు బీరుట్‌పై ఇజ్రాయిల్ బలగాలు జరిపిన దాడుల్లో ఆరుగురు మరణించారని లెబనాన్ మీడియా బుధవారం తెలిపింది. పాలస్తీనా శరణార్థుల శిబిరంలో ముగ్గురు, దక్షిణ సిడాన్ ఏరియాలో మరో ముగ్గురు మరణించారు.

**మధ్యవర్తిత్వానికి పాక్ ఎంపికెందుకు?**

పాకిస్తాన్‌ను మధ్యవర్తిగా ఎంపిక చేసుకోవడానికి వెనుక పలు కారణాలు కనిపిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ జరిగినప్పటి నుండి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను శాంతి దూతగా పాకిస్తాన్ అభివర్ణించడం అందులో ఒక కారణం కాగా కీలకమైన ఖనిజాల ఒప్పందాన్ని అమెరికాతో కుదుర్చుకోవడానికి పాకిస్తాన్ ముందుకు రావడం మరో కారణంగా వుంది. అలాగే గాజా శాంతి బోర్డులో చేరడం కూడా వారి బంధాన్ని మరింత బలపరిచింది. పాకిస్తాన్ మధ్యవర్తిత్వ యత్నాల గురించి పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ బుధవారం సౌదీ యువరాజు ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్‌కు వివరించారు. అంతకు ముందు అమెరికా, ఇరాన్‌ల మధ్య అర్థవంతమైన చర్చలు జరిగేలా చూసేం దుకు పాకిస్తాన్ సిద్ధంగా వుందని షరీఫ్ ఎక్స్ పోస్టులో తెలిపారు. కొన్ని గంటల తర్వాత ట్రంప్ దాన్ని తన సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు.



## మీకోసం

వేసవిలో వంట సమయాన్ని తగ్గించుకునేలా సలాడ్లు, పెరుగు పచ్చళ్లు లాంటివి ఎక్కువగా చేసుకోవాలి. ఇలా చేస్తే ఉక్కపోత నుండి ఉపశమనంతో పాటు గ్యాస్ కూడా ఆదా అవుతుంది.

## జీవన సౌరభం

లక్ష్యంపై ఉన్నంత శ్రద్ధాసక్తుల్ని లక్ష్య సాధనలో సైతం చూపించాలి. విజయ రహస్యం అదే ..



# అదేంటి .. మీకు తెలియదా!



'తాతయ్యా.. జ్యోతిష్యం గురించి ప్రతి రోజూ టీవీల్లో చెబుతుంటారు కదా! అదంతా నిజమేనా తాతయ్య!' అని అడిగాడు ఆనంద్.

'ఇది ఒట్టి మూఢవిశ్వాసం రా, మనవడా! అయినా నమ్మే వారి సంఖ్య అధికంగానే ఉంది. విచారించాల్సిన విషయమేమంటే.. ప్రముఖ సైకాలజిస్టులు కూడా ఆ జాబితాలో ఉన్నారు' అని తాతయ్య అంటుండగానే ఆనంద్ మధ్యలోనే కలగజేసుకున్నాడు.

'నాకూ నమ్మకం లేదు తాతయ్యా! ఈమధ్య వార్తలో చదివాను ఒకావిడ జ్యోతిష్యం నమ్మి ఆత్మహత్య చేసుకుంది' అని ఏడ్పు ముఖం పెట్టాడు.

'ఆ వార్త నేను కూడా చదివాను. ఇంజనీరింగ్ చదివి ఉద్యోగం చేస్తున్న అమ్మాయి జ్యోతిష్కుడు చెప్పిన మాటలకు భయపడి ఆత్మహత్య చేసుకుంది. అంత చదువుకున్న అమ్మాయి కూడా ఈ మూఢనమ్మకానికి అమాయకంగా బలైపోయింది' అని విచారంగా ముఖం పెట్టాడు తాతయ్య.

'తాతయ్యా! ఈ విషయం మీద నేను మా స్కూల్లో నిర్వహిస్తున్న వార్షిక కార్యక్రమానికి ఒక హాస్య కథ రాయాలనుకుంటున్నాను' అని మెరుస్తున్న కళ్లతో ఆనంద్ చెప్పాడు.

'ఔనా! ఎలా రాస్తున్నావో నాకు కూడా చెప్పవూ!' అని తాతయ్య మనవడిని గారంగా దగ్గరకు తీసుకుంటూ అడిగారు.

'జనాలకు జ్యోతిష్యం చెప్పే జ్యోతిష్కులు ముందు తమ జోస్యం చూసుకోవాలి అన్నది నా కాన్సెప్ట్ తాతయ్యా. ఈమధ్య దుబాయ్‌లో ప్రపంచ జ్యోతిష్కుల మహాసభ జరిగింది. అక్కడి నుండే నా కథ మొదలవుతుంది. ఆ కార్యక్రమానికి వివిధ దేశాల నుండి వందలమంది జ్యోతిష్కులు పాల్గొన్నారు. ఇంతలో అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్ మీద యుద్ధం ప్రకటించాయి. అంతే! ఎక్కడి కార్యక్రమాలను అక్కడే వదిలేసి జ్యోతిష్కులంతా తిరుగు ప్రయాణం చేయాలనుకున్నారు. అప్పుడు వారంతా విమానాశ్రయంలో చిక్కుకుపోయారు. విమానాలు ఎప్పటి నుండి నడుస్తాయని సిబ్బందిని అడిగారు. విమానాశ్రయ సిబ్బంది వారి గురించి తెలుసుకుని చాలా ఆశ్చర్యపోతూ 'అయ్యో అదేంటి సాములు! మీరంతా జ్యోతిష్కులే కదా! యుద్ధం వస్తుందని .. ఇలా ఇరుక్కు పోతామని మీ భవిష్యత్తు ముందే తెలుసుకోలేకపోయారా?' అని అడుగుతారు' అని ఆనంద్ కథ చెప్పడం పూర్తి చేయగానే 'భలే ఉందిరా భడవా నీ కథ!' అని తాతయ్యా ఇంకాస్త దగ్గరగా మనవడిని హత్తుకున్నారు.

**- చెన్నూరి సుదర్శన్**
**94405 58748.**

## నేను గీసిన బొమ్మ





**ఎం. అనిత,**
**5వ తరగతి,**
**ఎంపిపిఎస్ నర్సింహులపల్లి,**
**పెద్దపల్లి జిల్లా.**

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# రోగ రహిత సమాజం కోసం ...

**నలభై సంవత్సరాల నుంచి సుమారు లక్ష మంది మహిళలకు హెల్త్ స్క్రీనింగ్ చేసిన వైద్యురాలు ఆమె. వ్యాధి రహిత సమాజం కోసం నిరంతరం కృషిచేస్తున్నారు. ముందస్తుగానే వైద్యపరీక్షలు నిర్వహించటం ద్వారా రాబోయే వ్యాధులను దరిచేరకుండా అవగాహన, అప్రమత్తత చేస్తుంటారు. ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌లోనూ ఆరోగ్య సూచనలు అందిస్తూ, నిరంతరం రోగులకు అండగా ఉంటున్నారు. క్యాన్సర్, మధుమేహం, హృద్రోగం, థైరాయిడ్ సమస్యలు... ఇలా అన్నిటికీ అవసరమైన ముందుగా కనుక్కునే పద్ధతిని రుజువు చేస్తున్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించే వైద్యపరీక్షలు లక్షమందికి పైగా మహిళలకు నిర్వహించారు. గుండె, కిడ్నీ జబ్బులు తగ్గుముఖం పట్టడానికి తనదైన శైలిలో చికిత్స అందిస్తున్నారు డాక్టర్ శారద. పేద, సాదలైన రోగుల నుంచి నామమాత్రపు రుసుం మాత్రమే తీసుకుంటారు. కొందరి వద్ద అది కూడా తీసుకోరు. తెనాలి పట్టణ వాసులకు, పరిసర గ్రామాలకు ఆమె సుపరిచితులు.**



గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రు గ్రామానికి చెందిన దుద్దెంపూడి సీతారామయ్య, సులోచన దంపతుల కుమార్తె శారద. గత నాలుగు దశాబ్దాలుగా తెనాలిలో శ్రీ సత్యసాయి నర్సింగ్‌హోం నిర్వహిస్తూ వైద్యసేవలు అందిస్తున్నారు. ఆమె తాత కొలసాని వెంకటప్పయ్య ఆ ప్రాంతంలో మొదటి టీచర్‌గా గుర్తింపు పొందారు. అమ్మమ్మ కొలసాని శేషారత్నం. తండ్రి తరపున తాతయ్య, నానమ్మ దుద్దెంపూడి లక్ష్మయ్య చౌదరి, సౌభాగ్యమ్మ కూడా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేశారు. గ్రామంలో పేదలకు ఉచితంగా భూముల పంపిణీ, చెరువుల నిర్మాణాలకు విరాళాలను అందజేశారు. ఇప్పటికీ సౌభాగ్యమ్మ పేరుతో ఓ నీటికుంట ఉంది. పుట్టినింట, మెట్టినింట సేవాభావం కలిగిన వ్యక్తులు ఉండటంతో శారద కూడా సమాజసేవనే ఎంచుకున్నారు. సేవాభావంతో వైద్యసేవలు అందజేస్తున్నారు.

**చిన్నప్పటి నుంచి ...**

డాక్టర్ శారద చిన్నప్పటి నుంచి చదువులోనూ, ఆటల్లోనూ, ఇతర సేవా కార్యక్రమాల్లోనూ ముందుండేవారు. ఆ రోజుల్లో అనారోగ్యం కలిగినా పలువురు ఆర్థిక ఇబ్బందులతో పట్టణాలకు వెళ్లలేక బాధపడుతూ చనిపోయిన వారు ఉండేవారు.

తాను డాక్టరయ్యి భవిష్యత్తులో అనారోగ్యంతో వచ్చే చావుల్లో కొన్నింటినైనా ఆపాలని భావించారు శారద. ప్రాథమిక విద్య తెనాలిలో జరిగింది. సెకండరీ విద్య పూర్తయిన తర్వాత గుంటూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్‌ను గైనకాలజీ విభాగంలో పూర్తిచేశారు. తర్వాత ప్రివెంటివ్ కార్డియాలజీ సర్టిఫికెట్ కోర్సు–త్రిశి, డయాబెటిక్ సర్టిఫికెట్ కోర్సు తమిళనాడులోని ఐఎంఎ కాలేజీలో పూర్తిచేశారు. తెనాలిలో నర్సింగ్‌హోమ్‌ను 1993లో ప్రారంభించారు. నాటి నుంచి పేద ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు. 90 శాతం వ్యాధులు రాకుండా చేయటమే లక్ష్యంగా ఆమె గైడెన్స్ ఇస్తుంటారు.

**డోర్ టు డోర్ డెస్టినేషన్ (డి3) నిర్వహణ భేష్**

డిసీజ్ ఫ్రీ తెనాలి కోసం డి3 సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ శారద చేసిన ప్రయత్నం ఫలించింది. ఆమె నిస్వార్థ వైద్య సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ అనుమతితో కమ్యూనిటీ హెల్త్ పైలెట్ ప్రాజెక్టును మంజూరు చేసింది. 2025, అక్టోబర్ నెల నుంచి 'డోర్ టు డో డెస్టినేషన్' డి3 పేరుతో ఈ ప్రాజెక్టు కొనసాగుతోంది. మహిళలకు గర్భాశయ ముఖ ద్వార, రొమ్ము క్యాన్సర్ నిరార్ధణ పరీక్షలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. గతేడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ మూడునెలల కాలంలో పరిశీలిస్తే 3 వేల మంది మహిళలను పరీక్షించగా వారిలో ఎనీమియా 1909, ఒబెసిటీ 872, అల్ట్రాసౌండ్ అబ్నార్మలిటీస్ 567, ఫ్యాటీ లివర్ 320, సర్వైకల్ ఎక్ట్రోపీనియన్స్ 144, గుర్తించిన క్యాన్సర్ కేసులు 8, హైరిక్స్ పాప్ సెరమ్స్ 10, డయాబెటిక్ 1050, హైబీపీ 657, థైరాయిడ్ 530 మందికి ఉన్నట్లుగా మెడికల్ టెస్టుల్లో వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత చికిత్సలతో 17 మంది మహిళలు క్యాన్సర్ నుంచి, 220 మంది డయాబెటిక్, 173 మంది థైరాయిడ్ నుంచి బయటపడ్డారు. డయాబెటీస్ 830, హైబీపీ 390, థైరాయిడ్ నుంచి 357 మంది వ్యాధి తెలుసుకుని మందులు వాడుతున్నారు. ఇలా ప్రతిరోజూ, ప్రతి వారం, ప్రతి నెలా పరీక్షలు చేస్తూ గుర్తించిన రోగాలు పూర్తిగా తగ్గించేలా కృషిని కొనసాగిస్తున్నారు.

**శ్రీ శారదా సర్వీసెస్ ద్వారా ...**

శ్రీ శారదా సర్వీసెస్ సొసైటీ ద్వారా వైద్యసేవలు, సామాజిక సేవా కార్యక్రమాలు సైతం కొనసాగుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగుల కోసం ప్రత్యేకంగా అంబులెన్స్‌ని ఏర్పాటు చేశారు. స్త్రీ వ్యాధుల నివారణకు వందలాది ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. లక్షమందికిపైగా మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా వారి ఇళ్లకే వెళ్లి పరీక్షలు చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు వెళ్లి రోగులకు సేవలందిస్తున్నారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్సలు తప్పదు. కానీ వ్యాధులు రాకుండా కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా సాధ్యమవుతుందని ఆమె తన సందేశాల్లో చెబుతుంటారు. ప్రస్తుతం కలుషిత ఆహారం, నీటి వలన, కాలుష్య కారకాలతో కూడా వ్యాధులు ఉధృతమవుతున్నాయని ఆమె చెబుతున్నారు. నవజాత శిశులకు సైతం అనారోగ్య పరిస్థితులు వస్తుండటంపై ఆమె బాధపడుతుంటారు. అందుకే ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ శరీరానికి శ్రమనిచ్చే ఎక్సర్‌సైజులు, వ్యాయామాలు వంటివి ఖచ్చితంగా చేయాలని ఆమె చెబుతున్నారు.

**కరోనా సమయంలో...**

కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో డాక్టర్ శారద ఇంటింటికీ వెళ్లి మందులు పంపిణీచేశారు. కోవిడ్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. లక్షలాది రూపాయలు విలువ చేసే మందులు, మాస్కులు పంపిణీచేశారు. 50 ఆక్సిజన్ సిలిండర్లను సైతం వితరణగా అందజేశారు. పిపిఇ కిట్లను ఆంధ్ర, తెలంగాణాతోపాటుగా తమిళనాడు వంటి ప్రాంతాలకు కూడా తమ సొసైటీ ద్వారా పంపించారు. 2017లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉమెన్ ఎక్సలెన్సీ అవార్డును అందుకున్నారు. గతంలో తమిళనాడు గవర్నర్‌గా ఉన్న రోశయ్య కూడా ఆమె పనితీరును మెచ్చుకున్నారు.

**- యడవల్లి శ్రీనివాసరావు**

## మానవతా దృక్పథంతో ...

గతంతో పోలిస్తే జీవనశైలిలో వచ్చిన మార్పులతో శారీరక శ్రమ తగ్గిపోయింది. ఒత్తిడి మయమైన జీవితాలు గడుపుతున్నాం. అందుకే ప్రతిఒక్కరూ శారీరక శ్రమను చేయాలి. వ్యాయామాలు కూడా క్రమం తప్పకుండా చేయటం మంచిది. సురక్షిత ఆహారం, మెరుగైన జీవన శైలిని అలవాటు చేసుకుంటే 90 శాతం జబ్బులు దరిచేరవు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే కొన్ని వ్యాధులు దరిచేరవు. వ్యాధి రహిత సమాజమే లక్ష్యం.

**- డాక్టర్ డి.శారద**
**స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణులు, తెనాలి .**



# యుద్ధ ప్రకంపనలు

- కంటిమీద కునుకులేని పశ్చిమాసియా వలసదారులు
- ఆందోళనలో మన రాష్ట్రంలోని వారి కుటుంబసభ్యులు

**ప్రజాశక్తి– ఏలూరు ప్రతినిధి, విజయనగరం ప్రతినిధి/బాడంగి**

యుద్ధం ప్రకంపనలు మన రాష్ట్రం నుంచి వలస వెళ్లిన వారినీ తాకాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తోన్న భీకర దాడులు, ఇరాన్ ప్రతిఘటనతో పశ్చిమాసియాలో బాంబుల మోతలు నిత్యకృత్యమయ్యాయి. ఉపాధి కోసం ఆ ప్రాంతాలకు మన రాష్ట్రం నుంచి వలస వెళ్లిన వారి భద్రతకు ముప్పు వాటిల్లింది. సమీపంలోనే డ్రోన్లు, మిసైల్స్ పడుతుండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని భయానక పరిస్థితుల్లో వారు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తమ దయనీయ పరిస్థితులను తెలియజేస్తున్నారు. స్వదేశానికి రావడానికి వీలుగాక సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. 'ప్రజాశక్తి'కి వీరిలో కొందరు ఫోన్లో తమ పరిస్థితిని, స్థానిక ఉంటున్న వారి కుటుంబసభ్యులు ఆయా దేశాల్లోని తమ వారి దయనీయ స్థితిని వివరించారు. గల్ఫ్‌లో ఉన్న తమ వారి భద్రతపై ఇక్కడి కుటుంబ సభ్యులు తీవ్రంగా కలత చెందుతున్నారు. తమ వారి ఫోన్ కాల్స్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఎనిమిది వేల మంది వరకూ గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లినట్లు అంచనా. వీరిలో అత్యధికమంది మహిళలు, దళితులు, బిసిలు. డ్రైవర్లుగా, తోటపనివారుగా, గొర్రెలు పెంపదారులుగా, సెక్యూరిటీ గార్డులుగా, భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తున్నారు. కొందరు ఇళ్లలో పనికి చేరారు. అక్కడ పనిచేసి ఇక్కడికి పంపిస్తున్న డబ్బులతో పిల్లల చదువులు, ఇంటి అవసరాలకు వెచ్చిస్తున్నారు. కొంతమంది పది, 20 ఏళ్లగా గల్ఫ్‌లో పనిచేస్తున్నారు. విజయనగరం జిల్లా బాడంగి మండలం పాల్తేరు, దత్తిరాజేరు మండలం కోరపుకొత్తవలస తదితర గ్రామాల నుంచి సౌదీ అరేబియా, యుఎఇ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్), ఖతర్, కువైట్, బహ్రెయిన్, ఒమాన్ తదితర దేశాల్లోని ఆయిల్, ఫెర్రోఎల్లాయిస్, సాఫ్ట్‌వేర్ తదితర కంపెనీల్లో ఉద్యోగాల కోసం చదువుకున్న యువత వెళ్లింది. వెల్డర్, ఇంటి పనులు, నిర్మాణ తదితర రంగాల్లో పనికి నిరక్షరాసులు వెళ్లారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని అక్కడి నుంచి తమను స్వగ్రామాలకు క్షేమంగా చేర్చాలని వాసులదారులు కోరుతున్నారు. 'నా కొడుకు హరీష్ దుబాయ్‌లో సివిల్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. రోజూ టివిలో యుద్ధం వార్తలు చూస్తే గుండె దడ పెరుగుతోంది' అని విజయనగరం జిల్లా బాడంగి మండలం ఆకులకట్ట గ్రామానికి చెందిన నౌడు పాపినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. 'నా కొడుకు అబుదబీలో భార్యాపిల్లలతో ఉంటున్నాడు. యుద్ధం ఎప్పటికీ ఆగకపోవడంతో గుండె తరుక్కుపోతోంది' అని అదే మండలం పాల్తేరు గ్రామానికి చెందిన .వి.గౌరునాయుడు (రిటైర్డ్ టీచర్) వాపోయారు.

### ఇంటిలోనే ఉంటున్నాం

ఉపాధి కోసం కతార్ వెళ్లాను. ప్లంబర్‌గా పనిచేస్తున్నాను. యుద్ధం వల్ల రాత్రి, పగలు బాంబుల శబ్దంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాం. ఇక్కడ ప్రభుత్వం ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నా భయం వెంటాడుతోంది. అందరికీ సెలవులు ప్రకటించారు. ఇళ్లలోనే ఉండాలని ఆదేశించడంతో బయటకు రావడం లేదు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని భయానక పరిస్థితి నెలకొంది.



**-ఐ.రామకృష్ణ. నరసాపురం, పశ్చిమగోదావరి జిల్లా**

### స్వదేశానికి వచ్చేందుకు సిద్ధం

మూడేళ్ల క్రితం ఉద్యోగం నిమిత్తం సౌదీ వెళ్లాను. నర్స్‌గా పనిచేస్తున్నాను. కొద్ది రోజుల నుంచి రాత్రి, పగలు బాంబుల హోరు వినిపిస్తోంది. తిరిగి మన దేశానికి వచ్చేద్దామంటే ఎయిర్‌పోర్టులు మూసివేశారు. గతంలో ఎప్పుడూ గల్ఫ్‌లో ఇటువంటి పరిస్థితి చూడలేదు. భారత ప్రభుత్వం విమానాలు పంపితే చాలామంది స్వదేశానికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.,



**-టి.జ్యోతి, నరసాపురం, పశ్చిమగోదావరి జిల్లా'**

### 8 కిలోమీటర్ల దూరంలో మిస్సైల్

విజయనగరం జిల్లా బాడంగి మండలం పాల్తేరు గ్రామానికి చెందిన నేను ఖతర్‌లోని రస్లా ఫాన్ ప్రాంతంలో ఉంటున్నాను. మాకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో మిస్సైల్ పడింది. దీంతో, ఎప్పుడు ఎవరిపై బాంబులు పడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. మరోవైపు కంపెనీ సెలవులు ఇవ్వడం లేదు. ప్రస్తుతానికి ఇలా గడుస్తున్నా యుద్ధవాతావరణం మరింత వేడెక్కితే ఎలా ఉంటుందోనని తీవ్ర ఆందోళనగా ఉంది.

**-వంగపండు శరత్‌కుమార్, వెల్డర్**

# రామ్ చరణ్‌కు గాయం



'పెద్ది' సినిమా షూటింగ్‌లో రామ్ చరణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆయన కంటి దగ్గర దెబ్బ తగిలినట్లు సమాచారం. 'అది చిన్న గాయమేనని కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంద'ని సినీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ కారణంగా పెద్ది షూటింగ్ కొన్ని రోజులు వాయిదా పడింది. ఏప్రిల్ 30 విడుదల లక్ష్యంగా ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది.

# 'హ్యారీ పోటర్' టీవీ సిరీస్




'హ్యారీ పోటర్' టీవీ సిరీస్ నుంచి 'ఫస్ట్ లుక్' వచ్చేసింది. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ HBO తాజాగా విడుదల చేసిన ఈ ఫస్ట్ లుక్‌లో కొత్త హ్యారీ పోటర్‌గా డొమినిక్ మెక్‌లాఫ్లిన్ కనిపిస్తారు. ఈ సిరీస్ కోసం ఒక భారీ స్టార్ కాస్ట్‌ను ఎంపిక చేశారు. రాన్ వీస్లీగా అలస్టైర్ స్టౌట్, హెర్మియోన్ గ్రేంజర్‌గా అరబెల్లా స్టాంటన్ కనిపించనున్నారు. కీలకమైన ఆల్బస్ డంబుల్‌డోర్ పాత్రలో ప్రముఖ నటుడు జాన్ లిత్గో, ప్రొఫెసర్ స్నేప్‌గా పాపా ఎస్సీడు లాంటి దిగ్గజాలు నటిస్తున్నారు. 2027 ప్రారంభంలో ఈ సిరీస్ స్ట్రీమింగ్ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# రోడ్డు ప్రమాదంలో యువనటి మృతి



రాజస్థాన్‌కు చెందిన యువ నటి, ప్రముఖ మోడల్ హర్షిల్ కాలియా (30) రోడ్డు ప్రమాదంలో మరణించారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఆమె ప్రయాణిస్తున్న కారు డివైడర్ ఢీకొట్టడంతో పల్టీలు కొట్టింది. షిప్రా పాత్ రోడ్డులో జరిగిన ఈ ఘటన జరిగింది. తీవ్ర గాయాలైన ఆమెను స్థానిక ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆమె మరణించారు. పోలీసులు కేసు నమోదుచేశారు. 'క్రైమ్ నెక్స్ట్ డోర్' అనే వెబ్ సిరీస్‌తో హర్షిల్ కాలియా పాపులర్ అయ్యారు. రాజస్థానీ ప్రాంతీయ సాంగ్స్‌లో ఆమె డ్యాన్సర్‌గా పనిచేశారు. ఆపై యాంకర్‌గా కూడా గుర్తింపు పొందారు.

# యువతకు రాయల్స్ పెద్దపీట

- 14ఏళ్ల సూర్యవంశీపైనే అందరి చూపు
- 2008లో టైటిల్ కైవసం
- గత సీజన్‌లో 9వ స్థానంతో వైఫల్యం




రాజస్తాన్ రాయల్స్ కొత్త జెర్సీ

**జైపూర్:** రాజస్తాన్ రాయల్స్ యువ క్రికెటర్లకు పెద్దపీట వేసింది. గత సీజన్‌లో 13ఏళ్ల వైభవ్ సూర్యవంశీని ఏకంగా రూ.1.10కోట్లకు కొనుగోలు చేసి అతనిని ఈ సీజన్‌కూ కొనసాగించడమే ఇందుకు నిదర్శనం. 2008 ఆరంభ సీజన్‌లో షేన్ వార్న్ సారథ్యంలో టైటిల్‌ను కొట్టిన రాజస్తాన్.. 2022లో రన్నరప్‌గా నిలిచింది. గత 18 ఐపిఎల్ సీజన్‌లలో ఏకంగా 6సార్లు ప్లే-ఆఫ్స్‌కు చేరింది. 2024 ఐపిఎల్‌లో ప్లే-ఆఫ్స్‌కు చేరి 3వ స్థానంలో సంతృప్తి పరిచినా.. 2025లో 9వ స్థానం నిలిచి నిరాశపరిచింది. ఇక ఈ సీజన్‌కు రాజస్థాన్ రాయల్స్ తీసుకున్న ఒక నిర్ణయం అభిమానుల నుంచి తీవ్ర విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది. 'ఎక్స్‌పీరియన్స్ లేదా యూత్' అన్న ప్రశ్నకు జట్టు మేనేజ్‌మెంట్ ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ.. సంజూ శాంసన్‌ను ట్రేడ్ చేసి చెన్నై సూపర్ కింగ్స్‌కు పంపించడం పెద్ద ట్విస్ట్‌గా మారింది. అతని స్థానంలో స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, ఇంగ్లండ్ ప్లేయర్ సామ్ కర్రన్‌లను తీసుకుంది. జడేజా లాంటి అనుభవజ్ఞుడు జట్టులోకి రావడంతో, అతడే కొత్త కెప్టెన్ అవుతాడని అందరూ భావించారు. కానీ జట్టు మేనేజ్‌మెంట్ మాత్రం అందరి అంచనాలను తలకిందులు చేస్తూ, యువ ఆటగాడు రియాన్ పరాగ్‌ను ఫుల్‌టైమ్ కెప్టెన్‌గా ప్రకటించింది. జడేజాను సపోర్టింగ్ రోల్‌కే పరిమితం చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఈ నిర్ణయంపై టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మాట్లాడుతూ.. జడేజానే కెప్టెన్ అవుతాడని తాను కూడా భావించానని, జడేజాకు కెప్టెన్సీ ఇచ్చి, పరాగ్‌ను వైస్ కెప్టెన్‌గా ఉంచితే జట్టుకు మంచి బ్యాలెన్స్ వచ్చేదని పేర్కొన్నాడు. అలాగే డాషింగ్ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను కూడా ఫ్యూచర్ కెప్టెన్‌గా తీర్చిదిద్దాలని సూచించాడు. రియాన్ పరాగ్‌కు లీడర్‌షిప్ అనుభవం లేదని చెప్పలేం. దేశవాళీ క్రికెట్‌లో అసోం జట్టును విజయవంతంగా నడిపించాడు. అయితే ఐపిఎల్ స్థాయి ఇందుకు పూర్తిగా భిన్నం. గత సీజన్‌లో సంజూ శాంసన్ గాయపడిన సమయంలో పరాగ్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. కానీ ఆ సమయంలో జట్టు ఆశించిన స్థాయిలో ప్రదర్శన ఇవ్వలేదు. రాజస్థాన్ కేవలం నాలుగు విజయాలతో పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో నిలిచిందన్నాడు. హెడ్ కోచ్ కుమార సంగక్కర వ్యూహాత్మకంగా బలమైన మద్దతు అందిస్తాడు. అలాగే క్లిష్ట పరిస్థితుల్లో రవీంద్ర జడేజా అనుభవం కూడా పరాగ్‌కు ఉపయోగపడుతుందన్నాడు. ఈనెల 30న రాజస్తాన్ జట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌ను చెన్నై సూపర్‌కింగ్స్‌తో తలపడనుంది.

**వైభవ్ సూర్యవంశీపై అందరి కళ్లూ..**

14ఏళ్ల యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీపై అందరి కళ్లు ఉన్నాయి. గత ఏడాది కాలంగా అండర్–19 స్థాయిలో నిలకడగా రాణించిన ఈ కుర్రాడిపై భారీ అంచనాలే ఉన్నాయి. ఈ చిన్నోడు ఈసారి కూడా ఐపిఎల్‌లో రాణిస్తే టీమిండియాలో చోటు ఖాయం. గత ఐపిఎల్ సీజన్‌లో ఏకంగా రూ.1.10 కోట్లు పెట్టి కొనుగోలు చేసింది. అప్పటికి అతడి వయసు 13ఏళ్లే. గత సీజన్‌లో బలమైన బౌలింగ్ లైనప్ ఉన్న గుజరాత్ టైటాన్స్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగాడు. టైమింగ్, శక్తిని జోడించి సిక్సర్ల మోత మోగిస్తూ కేవలం 35బంతుల్లోనే సెంచరీ కొట్టాడు. ఆ ఇన్నింగ్స్ గత ఐపిఎల్‌కే హైలైట్‌గా నిలిచింది. ఆ సీజన్‌లో 7మ్యాచ్‌ల్లో 206.55 స్ట్రైక్ రేట్‌తో 252 పరుగులతో రాణించాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో నాలుగు రోజుల మ్యాచ్‌లో 58 బంతుల్లోనే సెంచరీ కొట్టాడు. ఎసిసి అండర్–19 ఆసియా కప్‌లో 42 బంతుల్లోనే 144 పరుగులు బాదాడు. ఆ మ్యాచ్‌లో అతను 32 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేయడం విశేషం. ఇక ఈ ఏడాది జరిగిన ఐసిసి అండర్–19 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియాపై 80 బంతుల్లో 175 పరుగులతో మెరిసాడు. ఆ ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, 15సిక్సర్లు బాదడం విశేషం. దీంతో ఈ సీజన్ ఐపిఎల్‌లో సూర్యవంశీపై భారీ ఆశలు ఉన్నాయి.

**రాజస్తాన్ రాయల్స్ ఆటగాళ్లు:** రియాన్ పరాగ్(కెప్టెన్), జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, జడేజా, సందీప్ శర్మ, మిల్నే, ధ్రువ్ జురెల్, ఫెర్రెరా(వికెట్ కీపర్లు), సామ్ కర్రన్, శనక, ఆర్చర్, హెట్‌మైర్, దేశ్‌పాండే, బర్గర్, కుల్దీప్ సేన్, బిష్ణోయ్, సుశాంత్ మిశ్రా, శుభమ్ దూబే, దిగ్వేష్, అమన్ రావు, మాఫకా, యశ్ పంజా, ప్రెటోరియస్, రవి సింగ్, బ్రిజేశ్ శర్మ.

| రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌ల షెడ్యూల్... | |
|---|---|
| 30(సోమ) | రాజస్థాన్ × చెన్నై(బర్సపరా స్టేడియం, గౌహతి) |
| ఏప్రిల్ 4(శని) | రాజస్థాన్ × గుజరాత్(నరేంద్ర మోడీ స్టేడియం, అహ్మదాబాద్) |
| 7(మంగళ) | రాజస్థాన్ × ముంబయి(బర్సపరా స్టేడియం, గౌహతి) |
| 10(శుక్ర) | రాజస్థాన్ × బెంగళూరు(బర్సపరా స్టేడియం, గౌహతి) |

# బెంగళూరు, రాజస్థాన్‌లో యాజమాన్య మార్పు

- ఆదిత్యా బిర్లా గ్రూప్స్ చేతికి చాలెంజర్స్
- సోమానీ, వాల్‌మార్ట్‌కు రాయల్స్

**జైపూర్:** ఐపిఎల్ ప్రారంభానికి ముందు ఈ లీగ్ తొలి సీజన్ విజేత రాజస్థాన్ రాయల్స్‌తో పాటు 18వ సీజన్‌లో కప్పు కొట్టిన డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల అమ్మకం ప్రక్రియ కొలిక్కి వచ్చింది. రాజస్థాన్, బెంగళూరు జట్లు ఐపిఎల్ చరిత్రలోనే భారీ ధరకు అమ్ముడుపోయాయి. అమెరికాకు చెందిన వ్యాపారవేత్త కల్ సోమానీతో పాటు వాల్‌మార్ట్ ఫ్యామిలీ(రాబ్ వాల్టన్), హ్యాంప్ ఫ్యామిలీ రాయల్స్‌ను 1.63 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 15,300 కోట్లు)కు దక్కించుకుంది. ఇక ఆదిత్యా బిర్లా గ్రూప్(ఎబిజి), బ్లాక్‌స్టోన్, డేవిడ్ బ్లిట్జర్స్ బోల్ట్ వెంచర్స్‌తో పాటు ప్రముఖ మీడియా దిగ్గజం టైమ్స్ ఆఫ్ ఇండియాతో కూడిన కన్సార్టియం ఆర్సీబీని 1.78 బిలియన్ డాలర్ల (రూ.16,700 కోట్లు)కు సొంతం చేసుకున్నాయి. బిసిసిఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. 2021లో బిసిసిఐ నిర్వహించిన కొత్త ఫ్రాంచైజీల వేలంలో సంజీవ్ గొయెంకా సారథ్యంలోని ఆర్‌పిఎస్‌జీ లక్నో జట్టును రూ. 7వేల కోట్లకు కొనుగోలు చేయడమే ఇప్పటిదాకా రికార్డు. తాజా డీల్ అందుకు రెండింతలుండటం గమనార్హం. నాలుగు సంస్థలతో కూడిన ఆర్సీబీ కన్సార్షియం.. యూనైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్(యుఎస్‌ఎల్) నుంచి పూర్తిస్థాయి యాజమాన్య హక్కులను సొంతం చేసుకోనుంది. దీంతో ఐపిఎల్ ప్రారంభ దశ నుంచి ఈ లీగ్‌లో భాగమైన ఈ రెండు జట్ల విలువ భారీగా పెరిగింది. 2008లో రాజస్థాన్ విలువ రూ. 320 కోట్లు కాగా ఇప్పుడది రూ. 15 వేల కోట్లుగా ఉంది. అప్పుడు బెంగళూరు విలువ రూ. 446 కోట్లుగా ఉంటే తాజా డీల్‌లో అది రూ. 16 వేల కోట్లకు పైమాటే. ప్రపంచ క్రీడా యవనికపై ఐపిఎల్ బ్రాండ్ ఏస్థాయిలో ఉందో చెప్పడానికి ఈ తాజా ఒప్పందమే నిదర్శనం.


Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited, D.No. 4-338/3, Flat No. 123, Industrial Estate, Swaroop Nagar, Lalacheruvu, Rajamahendravaram-533106, A.P State Ph. 0883-2440128,and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No. 4-338/3, Flat No. 123, Industrial Estate, Swaroop Nagar, Lalacheruvu, Rajamahendravaram-533106, Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email: editorprajasakthi@gmail.com, RNI Regd .No. APTEL/2005/15054